



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 128 | మంగళవారం 14 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi




- భారత్‌తో బాంధవ్యం ఏమిటి..
- మొరటోళ్లపై మురిపెం ఎందుకు..
- ఉగ్రవాదుల ముద్ర చెరిగెనా..
- మోడీ సర్కార్ సరికొత్త ట్విస్ట్..
- వారం పర్యటనలో విదేశీ మంత్రి..
- పాకిస్తాన్‌కు తాలిబాన్ల తల్లాఖ్ ..

# తాలిబాన్లు.. అస్మదీయులా.. తస్మదీయులా..?

'తాలిబాన్ల' అంశమై భారత్‌లో వేడీ,వాడీ చర్చ కొనసాగుతోంది. ఆఫ్ఘాన్ ప్రభుత్వ విదేశాంగ మంత్రి, అమీర్‌ఖాన్ ముత్తఖీ.. పేరు ప్రస్తుతం అందరి నోళ్లలో నానుతోంది. భారత సర్కారు ఆహ్వానంపై ఆ దేశ ప్రతినిధి బృందం వారం పాటు ఇక్కడ పర్యటించనుంది. ఆద్యంతం ఈ పర్యటన విశేష ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ, అంతర్జాతీయ మీడియా ఆఫ్ఘాన్ - ఇండియా సంబంధ, బాంధవ్యాలపై ఎప్పటి కప్పుడు బ్రేకింగ్ అందిస్తోంది. ఈ దశలో 'తాలిబాన్ల' తాజా మైత్రి పట్ల దేశంలో జోరుగా చర్చ జరుగుతోంది. గతం తాలూకు జ్ఞాపకాల తెరలు కళ్ల ముందు కదులు తున్నాయి. ఇంతకూ.. 'తాలిబాన్లు' భారత్‌కు అస్మదీయులా..తస్మదీయులా అనే మీమాంస కొనసాగుతోంది. **- సూర్యవాస్తవం, ప్రత్యేక ప్రతినిధి**



తాలిబాన్ విదేశీ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీ తన భారత పర్యటనలో భాగంగా యూపీలోని ప్రాచీన ఇస్లామీ విద్యాసంస్థ దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్‌ను తొలుత సందర్శించారు. ఒకప్పుడు తాలిబాన్లను తెగనాడిన యూపీ సీఎం యోగీ సర్కార్ ఆయన్ను ఘనంగా స్వాగతించింది. దారుల్ ఉలూమ్ కార్య నిర్వాహక వర్గం..అధ్యాపక బృందం,విద్యార్థిలోకం అపూర్వ స్వాగతం పలికింది. అత్యంత వినయ విధేయలతో ముత్తఖీ ధార్మిక పండితులతో సమావేశమయ్యారు. ఆపై మరుసటి రోజు (10న) దేశ రాజధాని ఢిల్లీలో విదేశీ మంత్రిత్వ శాఖల సంయుక్త ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మహిళా జర్నలిస్టులకు ప్రవేశం నిరాకరించడంతో .. అదికాస్త తీవ్ర సంచలననానికి కారణమైంది. దేశ చరిత్రలో మున్నెన్నడూ లేని విధంగా ఈ అంశం అత్యంత వివాదాస్పద మైంది. జాతీయ అంతర్జాతీయ మీడియాతో పాటు, దేశీయ పౌర సమాజం, విపక్ష నేతలు, మహిళా సంఘాలు, తీవ్రంగా నిరసించాయి. ఈ తప్పిదాన్ని మోడీ సర్కార్ వైఫల్యంగా పేర్కొంటూ దుమ్మెత్తి పోశాయి.

**విదేశీ మంత్రిత్వ శాఖ సంజాయిషీ:**

ఈ విషయమై తమ ప్రమేయం ఏమీ లేదని భారత విదేశీ మంత్రిత్వ శాఖ సంజాయిషీ ఇచ్చింది. తాలిబాన్ ప్రతినిధి బృందం సూచనల మేరకు ఆ తరహా సర్దుబాటు తప్పలేదని సముదాయించింది. స్వయంగా తాలిబాన్ విదేశీమంత్రి అమీర్ ముత్తఖీ కూడా అదే తరహా ప్రకటన చేశారు. ధార్మిక చట్టాల ప్రకారం మహిళలు ఏ దేశం వారైనా.. ఎక్కడైనా తాము పరదా నిబంధనలు ఉల్లంఘించలేమన్నారు. స్త్రీ సమాజం పట్ల తమకు అపారమైన

- మిగతా 2లో..



**మహ్మద్ షఫీ అహ్మద్, సీనియర్ జర్నలిస్ట్**

# ఆరెస్సెస్ క్యాంపుల్లో అఘాయిత్యాలా..!

**లైంగిక వేధింపులపై దర్యాప్తు జరపాలి : ఎంపీ ప్రియాంక డిమాండ్**



**తిరువనంతపురం-సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** కేరళలోని తిరువనంతపురంలో ఓ టెకీ ఆత్మహత్య ఆరెస్సెస్‌కు తీవ్ర ఇబ్బందిని కలిగిస్తున్నది. కారణం.. సదరు యువకుడు సోషల్ మీడియాలో నోట్ చేసిన ఆరోపణలే. తాను తన బాల్యం నుంచి ఆరెస్సెస్ శిబిరాల్లో లైంగిక వేధింపులను ఎదుర్కొంటున్నానని, అనేక మంది ఇలాంటి అనుభవాన్ని ఎదుర్కొన్నారని అందులో ఆరోపించాడు. అయితే ఈ విషయంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఈ విషయంపై వివరణాత్మక దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఆ యువకుడు చేసిన ఆరోపణలను సోషల్ మీడియా పోస్టులో ఆమె లేవనెత్తారు. ఆరెస్సెస్ నాయకత్వం వెంటనే చర్య తీసుకోవాలని డిమాండ్ చేసింది. కొట్టాయంలోని పొంకున్నంకు చెందిన ఆనందు అజి (24) తిరువనంతపురంలోని ఒక లాడ్జ్ గదిలో చనిపోయాడు. ఆయన మరణించిన తర్వాత ఓ వివరణాత్మక పోస్ట్ సోషల్ మీడియా వచ్చేలా షెడ్యూల్ చేశాడు. ఆయన బాల్యం నుంచి ఆరెస్సెస్ శిబిరంలో పదేపదే లైంగిక వేధింపులకు గురయ్యాడని తన పోస్ట్‌లో ప్రియాంక ఆరోపించింది. ఆయన ఆరెస్సెస్ నుంచి బయటకు వచ్చాడు కాబట్టి ఎదుర్కొంటున్న కష్టాల గురించి మాట్లాడగలిగాడని ఆమె పేర్కొన్నారు.

# రాజధానిలో సిఆర్‌డిఏ కార్యాలయం ప్రారంభం

- ఏడు ఫ్లోర్లలో నిర్మాణం
- భూములిచ్చిన రైతుల కోసం త్రిసభ్య కమిటీ : చంద్రబాబు ప్రకటన

**అమరావతి బ్యూరో-సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** రాష్ట్ర రాజధాని ప్రాంతంలో ఎట్టకేలకు కీలక అడుగు పడింది. రాజధాని ప్రాంత అభివృద్ధికి ఉద్దేశించిన సిఆర్‌డిఏ ప్రధాన కార్యాలయ భవానిన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం ప్రారంభించారు. 4.32 ఎకరాల్లో 3,07,326 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏడు ఫ్లోర్లలో (జి+7)ఈ భవనాన్ని నిర్మించారు. సిఆర్‌డిఏతో పాటు పురపాలనకు సంబంధించిన అన్ని రాష్ట్ర స్థాయి కార్యాలయాలను ఈ భవనానికి తరలించనున్నారు. భవనంలోని 2,3,5 అంతస్తుల్లో సిఆర్‌డిఏ, నాలుగో అంతస్తులో సిడిఎంఏ డైరక్టరేట్. ఆరవ అంతస్తులో అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. భవనాన్ని ప్రారంభించిన అనంతరం సిఎం మాట్లాడుతూ భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారం కోసం త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి యాత్ర ప్రారంభమైందని అన్నారు. రాజధానికి



అవసరమైన భూమి విషయంలో కొంత ఆందోళన పడ్డామని, ఈ సమయంలో అమరావతి రైతులు దారిచూపించారని అన్నారు. దీనికోసం సమీకరణ అనే కొత్త విధానాన్ని తెచ్చామని పేర్కొన్నారు. దాన్ని విజయవంతం చేసిన చరిత్ర రైతులదేనని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా ల్యాండ్ పూలింగ్ లేదని, ఈ విధానాన్ని తొలిసారి రాష్ట్రంలో తీసుకొచ్చామని చెప్పారు. అమరావతి పనుల పున:ప్రారంభం తరువాత మొదటిసారి ఏపిసిఆర్‌డిఏ భవనం ప్రారంభమైందని అన్నారు. భూములు త్యాగం చేసిన రైతులే ఫలితాలను అనుభవించాలని, దానికి తాను

- మిగతా 2లో..

# గాజాకు బ్రిటన్ సాయం



**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** గాజాలో తాగునీరు, పారిశుధ్యం, పరిశుభ్రత వంటి సేవల కోసం 27 మిలియన్ డాలర్ల ఆర్థిక సాయాన్ని అంద జేస్తానని బ్రిటన్ ప్రకటించింది. శాంతి సదస్సుకు హాజ రయ్యేందుకు ఈజిప్ట్ రాజధాని కైరో చేరుకున్న బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ ఈ విషయాన్ని తెలియజేశారు. యూనిసెఫ్, ప్రపంచ ఆహార కార్యక్రమం, నార్వే శరణార్థి కౌన్సిల్ ద్వారా నిధులు అందజేస్తామని బ్రిటన్ తెలిపింది. కరువు, పోషకాల లోపం, వ్యాధులతో బాధపడుతున్న వారికి సాయం చేయడమే సహాయ ప్యాకేజీ ఉద్దేశమని వివరించింది. గాజా పునర్నిర్మాణంపై మూడు రోజుల సదస్సు నిర్వహిస్తామని చెప్పింది. వివిధ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, ప్రయివేటు రంగ ప్రతినిధులు, అభివృద్ధికి ఆర్థిక సాయం అందించే సంస్థల ప్రతినిధులు

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

# అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ

**- హోంమంత్రి అనిత**

**అమరావతి-సూర్యవాస్తవం, అక్టోబర్ 13:** అమరావతిలో ప్రభుత్వం అం తర్జాతీయ స్పోర్ట్స్ సిటీని నిర్మించబోతున్నట్లు హోంమం త్రి వంగలపూడి అనిత తెలిపారు. పోలీస్ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ వంటి క్రీడా కార్య క్రమాలు పోలీస్ శాఖలోని క్రీడా సామర్థ్యాన్ని, శిక్షణ, పరస్పర సహకారాన్ని ప్రతిబింబిం చేందుకు గొప్ప వేదికగా నిలుస్తాయన్నారు. మంగళగిరి ఏపిఎస్‌పి 6వ బెటాలియన్, ఏపి స్పెషల్ పోలీస్ క్రీడా ప్రాంగణంలో ఆలిండి యా రెండవ వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 2025-26 పోటీలు ఢిల్లీకి చెందిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యాన సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా హోంమం త్రి అనిత, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టిం గ్‌లతో పాటు యోగాకు కూడా ఈ పోటీల్లో ప్రాధాన్యతనివ్వడం సంతోషకరమన్నారు. డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ.. 2వ ఆలిండియా పోలీస్

- మిగతా 2లో..



# తాలిబాన్లు..అస్మదీయులా..తస్మదీయులా..?

(మొదటిపేజీ తరువాయి)

గౌరవ మర్యాదలు ఉన్నాయని చాటేందుకు తదుపరి మీడియా సమావేశంలో మహిళా జర్నలిస్టులకు అనుమతించారు. నేల చూపులతోనే ముత్తఖీ మహిళా జర్నలిస్టులను సమాధాన పర్చారు. వాస్తవ షరియా నిబంధనలు.. పరదా ఆదేశాలు, తాలిబాన్ మంత్రి అభ్యర్థన ఎలా ఉన్నా.. దేశీయంగా 'తాలిబాన్ల' ప్రెస్ మీట్ అంశం మోడీ సర్కారుకు మింగుపడని ముల్లైంది. 'ఓట్ చోరీ' సతమతానికి తోడు తాలీబాన్ ట్రిప్ సరికొత్త తలనొప్పులు తెచ్చిపెట్టింది. తాలిబాన్లను తెగిడిన నోటితోనే పొగడాల్సిన దుస్థితి.. మోడీ సర్కారుకు ముచ్చెమటలు పట్టిస్తోంది. విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శనాస్త్రాలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

**తాలిబాన్ల శుద్ధీకరణ ఎలా జరిగింది:**

ఒకప్పుడు తాలిబాన్లను వినాశకారులని.. ప్రపంచానికి బూచీగా చూపి భయపెట్టిన మోడీ సర్కార్ అనుకూల మీడియా, తాలీబాన్ల శుద్ధీకరణకు నానా తంటాలు పడుతోంది. తాలిబాన్లలో గుడ్,బ్యాడ్ ఉండరని, గతంలో పదే పదే ప్రస్తావించిన మోడీ,యోగీ ద్వయం కనువిప్పుపై 'కవరింగ్ ' స్టోరీలు వండుతోంది. మొత్తం మీద తాలిబాన్ల భారత్ ట్రిప్ దేశీయంగా హోరెత్తించినా.. అంతర్జాతీయంగా అంతకు మించిన ప్రాధాన్యత సంతరించుకుంది. విదేశీ దౌత్య వహరాల్లో మున్నెన్నడూ లేని చేదును చవిచూస్తున్న మోడీ సర్కారు 'ఉపశమన ' చర్యల్లో భాగంగానే 'తాలిబాన్ల' ను దువ్వుతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు అల్లుతోంది. మానవత్వం ఎరుగని మృగాలుగా ముద్రపడ్డ తాలిబాన్లు .. ఉన్నట్లుండి దైవదూతల జాబితాలోకి ఎలా ఎక్కారనేది మొత్తం మీద మీడియాకు మింగుడు పడని అంశమైంది.

**తాలిబాన్ల వైఖరిలో సమూల మార్పు:**

భారత్ సర్కార్ ఆహ్వానం మేరకే తాలిబాన్ బృందం మనదేశ పర్యటనకు పూనుకుంది. 'సుదీర్ఘ అంతర్గత హింస' కు తెరదించి.. తాలిబాన్లు ఆఫ్ఘాన్ మొత్తంపై అధికారం సాధించారు. అగ్రరాజ్యం అమెరికా స్వయాన తమ కీలు బొమ్మ అష్రఫ్ ఘనీ ప్రభుత్వాన్ని కాదని తాలిబాన్లకు అధికారం అప్పగించి దశాబ్దాల అనిశ్చితికి ముగింపు పలికింది. 2001లో మొదలైన 'తాలిబాన్' సమరం 2021 వరకు అప్రతిహతంగా కొనసాగింది. తమ తాబేదారు గత అధ్యక్షుడు హమీద్ కర్జాయ్‌ను తొలిదశలో తెరపైకి తెచ్చి, 2014 వరకు ఆఫ్ఘాన్ అధ్యక్ష పీఠంపై కొనసాగించే ప్రయత్నం చేసింది. క్రమ క్రమంగా ఆఫ్ఘాన్ మొత్తం తాలిబాన్ల వశం కావడం.. కీలు బొమ్మ నేతలపై నమ్మకం వమ్ముకవాడం.. యుద్ధం కొనసాగింపు అసాధ్యం కావడంతో .. గత్యతంతరం లేక అగ్రరాజ్యం ఆపై వ్యూహాత్మకంగా అడుగులు వేసింది. తన చేతి కీలుబొమ్మలను తానే దించి.. 2021లో తాలిబాన్లకు బేషరుతుగా అధికారాన్ని బదలాయించింది. ఆఫ్ఘాన్ అధికార పీఠం సంపూర్తిగా తమ ఆధీనంలోకి రావడంతో తాలిబాన్లు.. ఉదారవాదం బాట పట్టారు. దశాబ్దాలుగా ఛిద్రమైన ఆఫ్ఘాన్ పునర్నిమాణం దిశగా అడుగులు వేస్తున్నారు.

**పహల్గామ్ ఖండనతో స్నేహబంధం:**

వాస్తవానికి ఇటీవలి భారత్‌లో జరిగిన ఫహల్గామ్ ఉగ్రదాడిని ఆఫ్ఘాన్ ముందుగా ఖండించి, సంపూర్ణ సానుభూతి వ్యక్తం చేయడంతో ఇరు దేశాల మధ్య స్నేహ బంధాలు చిగురించాయి. వేగంగా మారు తున్న ప్రపంచ పరిణామాల నేపథ్యం.. పొరుగు దేశాలతో భారత్ సంబంధ బాంధవ్యాలలో గణనీయ మైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. హౌడీ మోడీ అని ట్రంప్ దువ్వినా.. అప్కీ బార్ ట్రంప్ సర్కార్ అని వత్తాసు పలికినా.. అగ్రరాజ్యం అమెరికాకు తన స్వార్థం తప్ప ఏదీ ఎక్కువ కాదని తేలిపోయింది. భారత్ ఆపరేషన్ సింధూర్‌పై ట్రంప్ కప్పదాటుడు వైఖరితో నిజస్వరూపం నిగ్గు తేలింది. ఆశలు పెంచుకున్న 'శాంతి నోబుల్ ' చేజారడంతో .. ఆ ప్రక్రియ పొరుగు దేశం పాక్‌కు లాభించింది. అమెరికా మాదిరిగానే కెనడా,ఆపై కొన్ని యూరోపియన్ దేశాలతో మన దౌత్య సంబంధాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మన మిత్ర దేశం బంగ్లాదేశ్‌తో బాంధవ్యం ఇటీవల చెదిరింది. పొరుగు దేశాలు శ్రీలంక,నేపాల్,మాల్దీవులతో ఇంచుమించు అదే పరిస్థితి. ఈ సంకట పరిస్థితుల్లో భారత్‌కు భౌగోళికంగా అత్యంత కీలకమైన ఆఫ్ఘాన్‌తో స్నేహ హస్తం, జాతీయ ప్రయోజనాలరీత్యా మరింత శ్రేయస్కరం.

**పాక్‌కు తాలిబాన్ తల్లాఖ్:**

సంపూర్ణ అధికారం చేజిక్కిన తరువాత తాలిబాన్లు అన్నింటినీ వీడి ఆఫ్ఘాన్ పునర్మిణానికి ప్రాధానత్య ఇస్తున్నారు. అందుకు గాను 'పాక్' తో ఇదివరకు మాదిరి సంబంధాలు లాభసాటి కావని గుర్తించారు. సీమాంతర ఉగ్రవాదానికి పుట్టినిల్లయిన పాక్‌కు తల్లాఖ్ చెపితే తప్ప అది సాధ్యం కాదనే నిర్ణయానికొచ్చారు. తాలిబాన్ల ఈ మార్పు భారత్ తో స్నేహ హస్తానికి ఊతమిచ్చింది. తాలిబాన్ల ఎడబాటు పాక్‌కు మింగుడు పడటం లేదు. ఆఫ్ఘాన్ ప్రతినిధి వర్గం.. భారత తొలి పర్యటన వేళ కాబూల్‌లో పేలుళ్లు జరిగాయి. పొరుగు దేశం పాక్ ఈ అక్కసుతోనే కాబూల్‌పై ఉగ్రదాడికి తెగబడిందని విదేశీ మీడియా సంస్థలు విశ్లేషిస్తున్నాయి. తహ్రీకె తాలిబాన్ పాక్ (టీ.టీ.పీ) చీఫ్ నూర్ వాలీ మెహసూద్ స్థావరం లక్ష్యంగా ఈ దాడీ జరిగినట్లు వార్తలు వచ్చాయి. ఈ దుశ్చర్యను భారత్ పర్యటనలో ఉన్న ఆఫ్ఘాన్ విదేశీ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాఖీ ఖండించారు. తమ దేశంలో సీమాంతర ఉగ్రవాదానికి చోటు లేదని స్పష్టం చేశారు. గతంలో ఆఫ్ఘాన్‌లో పాగా వేసిన లష్కరే తోయిబా,జైష్ మహ్మద్ వంటి సంస్థలను తమ దేశం నుంచి ఈ నాలుగేళ్ల కాలంలో తరిమి కొట్టామని స్పష్టం చేశారు.

**విమానం హైజాక్ ఉదంతంలో**

**భారత్‌కు సహకారం:**

1999లో ఇండియన్ ఎయిర్‌లైన్ విమానం 1సీ 814 హైజాక్‌కు గురై కాందహార్‌లో ల్యాండ్ అయినప్పుడు,బందీల విడుదలకు తాలిబాన్ ప్రభుత్వం భారత్‌కు పూర్తి స్థాయిలో సహకరించింది. పాక్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు నిర్వహించే హర్కతుల్ ముజాహిద్ సంస్థ .. ఖాట్మాండు నుంచి బయలు దేరిన ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని అప్పట్లో హైజాక్ చేసింది. తీవ్ర ఉద్రికత్తతల నడుమ కొనసాగిన హైజాక్ డ్రామా అప్పటి భారత విదేశాంగ మంత్రి జస్వంత్ సింగ్ పర్యవేక్షణలో.. తాలిబాన్ల స్వచ్ఛంద సహకారంతో 8 రోజులకు ముగిసింది. ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న తాలిబాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీ.. హైజాక్ పరిష్కారంలో కీలక పాత్ర వహించారు. అందుకు ప్రస్తుత దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్‌కు అప్పట్లో చీఫ్ ప్యాట్రన్ గా ఉన్న రాజ్యసభ సభ్యులు మౌలానా అసద్ మదనీ సంధానకర్తగా వ్యవహరించారు. 26 ఏళ్ల క్రితం నాటి హైజాక్ అనుభూతులే ఆఫ్ఘాన్ విదేశీ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీని తొలిపర్యటనగా దారుల్ ఉలూమ్ దేవ్‌బంద్‌ను సందర్శించేటట్లు చేశాయి. ఈ సందర్భంగా ముత్తాఖీ జమీఅతే ఉలేమాయె హింద్ జాతీయ అధ్యక్షులు మౌలానా అర్షద్ మదనీతో పాటు వర్సిటీ రెక్టార్ ముఫ్తీ అబుల్ ఖాసీం నోమానిని కల్సి ఆశీస్సులు పొందారు. కాందాహార్ విమాన్ హైజాక్ ఉదంతం తాలిబాన్ల సహకారంతో పరిష్కారమై..వందలాది ప్రాణాలు దాక్కయి.

**ఆఫ్ఘాన్‌కు భారత్ ఇతోధిక సహకారం:**

ఆఫ్ఘాన్‌కు భారత్ కూడా ఇతోధికంగా సహాయ పడుతునే ఉంది. గడిచిన రెండు దశాబ్దాల్లో 300 కోట్ల డాలర్ల సాయం అందించింది. తాజాగా భారత్ 20కు పైగా అంబులెన్స్‌లను ఉచితంగా అందించనుంది. పాక్ నిజస్వరూపాన్ని గుర్తించి .. ఆఫ్ఘాన్ పూర్తి దూరం పాటిస్తున్న ఈ దశలోనే ఆదేశంతో చెలిమిని బలపర్చుకోవడం భారత్‌కు ఉత్తమం. అక్కడి అపార ఖనిజాలపై కన్నేసి.. పాక్‌కు బాసటగా నిలుస్తున్న చైనా, ఎత్తుగడలను వమ్ము చేయడానికి, ఆఫ్ఘాన్‌తో మరింత సాన్నిహిత్యం అవసరం. ఇప్పటి వరకూ ఆఫ్ఘాన్‌కు పాక్షిక గుర్తింపు నిస్తున్న భారత్, పూర్తి స్థాయి సార్వభౌమాధికార దేశంగా ఆ దేశాన్ని గుర్తించి.. మరింతంగా జాతీయ ప్రయోజనాల బలోపేతానికి కృషి చేయాల్సి ఉంది. గతం నుంచి కొనసాగుతున్న అనుమానాలను పటాపంచలు చేసి , పూర్తి స్థాయి మిత్ర దేశంగా అక్కున చేర్చుకోవాల్సిన అవసరం ఉంది. అది ఉభయత్రా ఇరు దేశాలకు శ్రేయస్కరం.. అదే భారత్ –ఆఫ్ఘాన్ అస్మదీయ మంత్రం. భారత జాతీయ,అంతర్జాతీయ ప్రయోజనాల లబ్ధికి తారక మంత్రం.

**ఆఫ్ఘాన్ పున: నిర్మాణానికే తాలిబాన్ ప్రాధాన్యం:**

2021 తుది ఆపరేషన్ తరువాత తమ దేశం పూర్తిగా మారిపోయిందని, హింస, ప్రతిహింసకు ఏమాత్రం తావులేదని, శాంతి..సుస్థిరతలే తమ దేశ ప్రస్తుత విధానమని ఆఫ్ఘాన్ విదేశీ మంత్రి ముత్తఖీ ఢిల్లీ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. శాంతియుత సమాజం కోసం పాకిస్తాన్ కూడా తమ మాదిరిగానే వ్యవహరించాలని.. తమలాగానే శాంతి స్థాపనకు కృషి చేయాలని,తమ దేశంలో హింసను ప్రోత్సహిస్తే తగు రీతిన గుణ పాఠం చెపుతామని హెచ్చరించారు. పాక్‌తో తాలిబాన్లు తెగతెంపులు చేసుకున్న ఈ దశలోనే ఆఫ్ఘాన్‌తో స్నేహ సంబంధాలు భారత్‌కు మరింత శ్రేయస్కరం. మధ్య ఆసియాతో అనుసంధాన ప్రాజెక్టులతో పాటు , జాతీయ భద్రతా అవసరాలు ఉన్న ఈ దశలో ఆఫ్ఘాన్‌తో మైత్రి భారత్‌కు మరింత అవసరం. వాస్తవానికి ఆఫ్ఘాన్‌తో శతాబ్దాల సాంస్కృతిక బాంధవ్యం భారత్‌కు ఉంది. 1996లో తాలిబాన్ల తొలిదశ అధికారం ఇరు దేశాల మధ్య కొంత దూరం పెంచినా.. ప్రస్తుతానికి సర్దుబాటు దిశలో సాగుతుంది.

# గ్రామ పంచాయితీల్లో భారీగా మార్పులు

**కాకినాడ–సూర్య వాస్తవం, అక్టోబరు 13:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ వ్యవస్థ రద్దుతో పాటు.. గ్రామ పరిపాలనా వ్యవస్థలో పలు నూతన సంస్కరణలకు ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్? సూచన మేరకు రూపొందించిన ఈ సంస్కరణలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇకపై గ్రామ పంచాయతీలను స్వతంత్ర పరిపాలనా యూనిట్లుగా మార్చనున్నారు. దీని వల్ల పంచాయతీల్లో కొలువులు కూడా పెరగనున్నాయి. గ్రామ కార్యదర్శి హోదాను కూడా పెంచనున్నారు. ఆ వివరాలు..ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేందుకు.. వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సంపూర్ణ సంస్కరణలు అమలు చేసేందుకు సిద్ధమయ్యింది. పునర్వ్యవస్థీకరణతో గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో 7,244 క్లస్టర్ల స్థానంలో ఉన్న 13,351 గ్రామ పంచాయతీలు.. ఇక మీదట ఇకపై స్వతంత్ర పరిపాలనా యూనిట్లుగా వ్యవహరిస్తాయి. గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా పునర్ వ్యవస్థీకరించేందుకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటితో పాటు అనేక సంస్కరణలు చేయగా.. ఏపీ కేబినెట్ వీటికి ఆమోదం తెలిపింది.నాలుగు గ్రేడ్లుగా గ్రామ పంచాయతీలను విభజించాలని భావించిన




ప్రభుత్వం.. 10 వేలు జనాభా దాటిన పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తించింది. వీటిల్లో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించి.. వాటిని రూర్బన్ పంచాయతీలుగా రూపొందించనున్నారు. అలానే గ్రామ కార్యదర్శి హోదాను.. పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ)గా మారుస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీటితో పాటు పంచాయతీరాజ్‌లో ప్రత్యేకంగా ఐటీ విభాగం ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది.కొత్తగా తీసుకువచ్చిన సంస్కరణల ప్రకారం, గ్రామ పంచాయతీలను స్పెషల్, గ్రేడ్–1, గ్రేడ్–2, గ్రేడ్–3 అనే నాలుగు రకాలుగా వర్గీకరిస్తారు. పట్టణాలకు సమీపంలో.. మైదాన ప్రాంతాల్లో ఉండి.. కనీసం 10,000 జనాభా కలిగి ఉండి.. కోటి రూపాయల ఆదాయం ఉన్న పంచాయతీలను ఇక మీదట రూరల్ అర్బన్ పంచాయతీలుగా పరిగణిస్తారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 5,000 జనాభా ఉన్న పంచాయతీలు కూడా ఈ కోవలోకి వస్తాయి. ఈ రూరల్ అర్బన్ పంచాయతీలు.. పురపాలికల మాదిరిగానే పాలనను కొనసాగిస్తాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 359 పంచాయతీలు ఈ పరిధిలోకి వస్తాయి.

గ్రేడ్ 1 కిందకు వచ్చే పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న 359 మంది కార్యదర్శుల వేతనాల పెంపుతోపాటుగా వారికి డిప్యూటీ ఎంపీడీఓ హోదా కల్పించారు. వీరిని రూర్బన్ పంచాయతీల్లో నియమించనున్నారు. అలాగే, 359 మంది జూనియర్ అసిస్టెంట్లకు.. సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇచ్చి రూర్బన్ గ్రేడ్ పంచాయతీల్లో నియమించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనితో పాటు పంచాయతీ రాజ్ శాఖలో ప్రత్యేక ఐటీ విభాగం ఏర్పాటు చేయనున్నారు.ఈ కొత్త వ్యవస్థతో పంచాయతీల్లో ఉద్యోగాల సంఖ్య భారీగా పెరుగుతుందని భావిస్తున్నారు. గతంలో గ్రామ పంచాయతీల్లో కేవలం సర్పంచి, కార్యదర్శి, గుమస్తా, పారిశుద్ధ్య కార్మికులు మాత్రమే ఉండేవారు. ఇప్పుడు ప్రతి పంచాయతీలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, అటెండర్లు, స్వీపర్లు, క్లర్క్/బిల్ కలెక్టర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, వాచ్‌మెన్, స్కావెంజర్లు, ఎలక్ట్రీషియన్/ఫిట్టర్ వంటి ఉద్యోగాలు కూడా రానున్నాయి. అలానే కాంట్రాక్ట్ బేస్డ్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను గ్రామ పంచాయతీ జనరల్ ఫండ్ నుంచే చెల్లించాలని నిర్ణయించారు. గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న డిప్యూటీ సీఎం పవన్ సూచనల మేరకు రూపొందించిన ఈ సంస్కరణలకు ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# మార్పులతో బీహార్ ఎలక్షన్స్

**హైదరాబాద్–సూర్య వాస్తవం, అక్టోబరు 13:**

బీహార్ అసెంబ్లీకి నవంబర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించేలా ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. ఈ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ అమలు చేయని మూడు కీలక చర్యలను ఎన్నికల సంఘం ప్రవేశపెట్టింది. అధికార, విపక్ష పార్టీలకు అభ్యంతరం చెప్పే వీలు లేకుండా, ఈ మార్పులు ఓట్ల క్రమబద్ధమైన లెక్కింపు, ఫేక్ ఓటింగ్ నిరోధానికి దోహదం చేయనున్నాయి. ఈసీ చేపట్టిన మూడు మూడు మార్పుల్లో మొదటిది ఇది. ప్రతీ పోలింగ్ బూత్‌లో ఓటింగ్ ప్రారంభం నుంచి అంటే ఈవీఎంల స్టిక్కర్లు తొలగించి పోలింగ్ తర్వాత మళ్లీ ఈవీఎంలకు సీల్ వేసే వరకూ వెబ్‌కాస్టింగ్ జరుగుతుంది. నేరుగా ఈ ప్రసారం మానిటరింగ్ బృందాలకు చేరుతుంది. పోలింగ్ అనంతరం కూడా మానిటరింగ్‌పై సమగ్రంగా సంతకాలతో ధృవీకరణ ఉంటుంది. దీంతో రిగ్గింగ్, ఓట్ల దొంగతనం వంటి తప్పిదాలు తక్షణమే గుర్తించడం, నిరోధించడం సాధ్యం.ఇక రెండో కీలక మార్పు ఇదీ.. ఇప్పటి వరకు ఈవీఎం ఓట్లు సరిచూసిన తర్వాత పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు జరిగేది. ఇకపై ముందుగా పోస్టల్ ఓట్ల లెక్కింపు పూర్తయి చివర్లో ఈవీఎం ఓట్ల చివరి రౌండ్ కౌంటింగ్ జరుగుతుంది. పోస్టల్ ఓట్లలో అవకతవకలకు అవకాశమే లేకుండా, ఫలితాలపై ప్రభావం జరగకుండా ఉంటుంది.మూడోది అత్యంత కీలకమైనది ఇది. బుర్కా ధరించి వచ్చే మహిళా ఓటర్ల గుర్తింపుపై ప్రతిసారి వివాదం జరుగుతోంది. మిగతా సందర్భాల్లో బుర్కా తొలగించేందుకు అభ్యంతరం చెప్పని ముస్లిం మహిళలు.. పోలింగ్ కేంద్రాల్లో మాత్రం అభ్యంతరం చెబుతున్నారు. దీంతో ఈసారి అలాంట సమస్య ఉండకుండా ముస్లిం మహిళా ఓటర్ల బుర్కా తొలగించి ఓటర్ ఐడీ లేదా ఇతర గుర్తింపు కార్డుతో ముఖాన్ని పోల్చేందుకు అంగన్‌వాడీ మహిళలను నియమించారు. గుర్తింపు కార్డుతో ప్రత్యక్ష ముఖచిత్రం సరిపోలిన తర్వాతే ఓటు వేయాలని కొత్త విధానం. దీంతో ఫేక్ ఓటింగ్, ఐడెంటిటీ మోసాలను అరికట్టే అవకాశం ఉంది. ఇది బిహార్‌లో విజయవంతమైతే దేశవ్యాప్తంగా అమలు చేయవచ్చు.ఓటరు గుర్తింపు జాబితాలో అభ్యర్థుల ఫొటోలు బ్లాక్?అండ్?వైట్ స్థానంలో కలర్ రూపంలో ఉండనున్నాయి. దీనివల్ల గుర్తుపట్టడం సులభం.ఈ విధానాలు విజయవంతమైతే, బీహార్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల నిజమైన హక్కులను రక్షించే కొత్త ఎన్నికల ప్రమాణంగా నిలుస్తాయి. ముఖ్యంగా నిరంతర వెబ్‌కాస్టింగ్, పోస్టల్ ఓట్ల క్రమబద్ధత, బుర్కా ధ్రువీకరణ ఇవి ఓటు ప్రక్రియలో మార్పులు.

# గాజాకు బ్రిటన్ సాయం

(మొదటిపేజీ తరువాయి)

దీనికి హాజరవుతారు. యూరోపియన్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్, ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు కూడా ఈ సదస్సులో పాల్గొంటారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పాలస్తీనాకు మానవతా సాయంగా 74 మిలియన్ పౌండ్లు అందజేశామని బ్రిటన్ తెలియజేసింది. పాలస్తీనా రాజ్యాన్ని బ్రిటన్ గత నెలలో గుర్తించిన విషయం తెలిసిందే.

# రాజధానిలో సిఆర్‌డిఎ కార్యాలయం ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

పూర్తిగా కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. రాజధానిని అపహాస్యం చేశారని, అయినా వెనకడుగు వేయలేదని తెలిపారు. అందివచ్చిన అవకాశాన్ని పుచ్చుకుని ముందడుగు వేశామన్నారు. భూములిచ్చిన రైతులతో త్వరలో సమావేశం అవుతామని, అందరం కలిసి రాజధానిని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.

## సమస్యల పరిష్కార బాధ్యత ముగ్గురికి

రాజధాని రైతులకు ఉన్న సమస్యలు పరిష్కరిస్తామని, వారికి ఏ ఇబ్బందులూ రాకుండా చేస్తామని తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించే బాధ్యత కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి నారాయణ, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌కు అప్పగిస్తున్నట్లు చెప్పారు. అప్పటికీ పరిష్కారం కాకపోతే తానే నేరుగా చూసుకుంటానని వివరించారు. దీన్ని సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో నిర్మిస్తున్నామని, ఒకసారి జరిగిన తప్పుకు ఎంత నష్టపోయామో అందురూ గమనించాలని అన్నారు. పవన్‌కల్యాణ్, బిజెపితో కలిసి ముందుకెళుతున్నామని, విశాఖ కూడా అద్భుతంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. దేశానికి వచ్చిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి విశాఖకు వస్తోందని అన్నారు. అనంతరం కార్యాలయం మొత్తం పర్యవేక్షించారు. సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, సిఎస్ విజయానంద్, తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, కొలికిపూడి శ్రీనివాసరావు, సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబు, ఎడిసిఎల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, సిఆర్‌డిఎ అదనపు కమిషనర్ భార్గవతేజ, రైతులు పాల్గొన్నారు.

# అమరావతిలో అంతర్జాతీయ స్పోర్ట్స్ సిటీ

(మొదటిపేజీ తరువాయి)

వెయిట్ లిఫ్టింగ్ క్లస్టర్ 202526 పోటీలకు రాష్ట్రం ఆతిధ్యం వహించడం రాష్ట్ర పోలీసులకు గొప్ప గౌరవమన్నారు. ఈ టోర్నమెంట్ కేవలం శక్తి, నైపుణ్య ప్రదర్శన మాత్రమే కాకుండా పోలీస్ సిబ్బందిలో స్నేహభావం, క్రమశిక్షణ, ఐక్యత పెంపొదిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐజి వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ కెవి మోహన్‌రావు, డిఐజి అన్బురాజన్, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గన్నారు.

# పాలిటిక్స్‌కి రాయపాటి ఫ్యామిలీ దూరం



**గుంటూరు-సూర్య వాస్తవం, అక్టోబరు 13**

రాజకీయంగా ఒక వెలుగు వెలిగిన చాలా కుటుంబాలు తర్వాత కనుమరుగయ్యాయి. అటువంటి జాబితాలో చాలా కుటుంబాలు ఉన్నాయి. అయితే గుంటూరు జిల్లాలో తనకంటూ రాజకీయం చేసిన రాయపాటి కుటుంబం ఇప్పుడు.. స్వచ్ఛంద విరమణ చేయాల్సి వచ్చింది. ఆ పరిస్థితులు దాపురించాయి. చిన్న వయసులోనే కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజ్యసభలో అడుగుపెట్టారు రాయపాటి సాంబశివరావు. తెలుగుదేశం ప్రభంజనంలో సైతం ఆయన గెలిచిన సందర్భాలు ఉన్నాయి. అయితే రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీ ఇబ్బందికర పరిస్థితుల్లోకి వెళ్ళింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో టిడిపిలోకి వచ్చారు రాయపాటి. ఒకసారి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. రెండోసారి పోటీ చేసి ఓడిపోయారు. అయితే ఎన్నికల్లో ఆయనకు కానీ.. కుటుంబానికి కానీ ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదు చంద్రబాబు. దీంతో ఎన్నికలకు ముందు రాయపాటి కుమారుడు టిడిపి నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. అందుకే టిడిపి అధికారంలోకి వచ్చినా ఆ కుటుంబానికి ఎటువంటి ప్రాధాన్యం లేకుండా పోయింది. అందుకే ఆ కుటుంబం పూర్తిగా రాజకీయాలనుంచి వైదొలగాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 1982లో తెలుగుదేశం పార్టీ ( ఆవిర్భవించింది. ఆ సమయంలో యువజన కాంగ్రెస్ లో ఉన్నారు రాయపాటి సాంబశివరావు. కమ్మ సామాజిక వర్గం నేత కావడంతో ఆయనను గుర్తించింది కాంగ్రెస్ పార్టీ. తొలిసారిగా రాజ్యసభకు నామినేట్ చేసింది. అప్పుడు ఆయన వయసు కేవలం 39 సంవత్సరాలు మాత్రమే. అటు తరువాత కాంగ్రెస్ పార్టీలో తిరుగులేని నేతగా ఎదిగారు రాయపాటి. 1996, 1998, 2004, 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా గెలిచారు. 2014లో టిడిపి తరపున పోటీ చేసి మరోసారి పార్లమెంట్ సభ్యులు అయ్యారు. 2019లో టిడిపి తరఫున పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో తనతో పాటు తన కుమారులను పోటీ చేయించాలని చూశారు. కానీ మారిన సమీకరణ నేపథ్యం లో చంద్రబాబు చాన్స్ ఇవ్వలేదు. 2024 ఎన్నికల్లో రాయపాటి సాంబశివరావు నరసారావు పేట పార్లమెంట్ సీటును ఆశించారు. గుంటూరు నుంచి కూడా అవకాశం కోరారు. కుమా రుడు రంగారావుకు సత్తెనపల్లి టికెట్ అడిగారు. కానీ సత్తెనపల్లి నుంచి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ కు ఛాన్స్ దక్కింది. గుంటూరు నుంచి పారిశ్రామికవేత్త పెమ్మసాని చంద్రశే ఖర్‌కు అవకాశం ఇచ్చారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుంచి లావు శ్రీకృష్ణ దేవరాయలకు అవకాశం ఇచ్చారు. దీంతో రాయపాటి కుమారుడు రంగారావు తీవ్ర ఆగ్ర హంతో ఊగిపోయారు. తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేశారు. అయితే ఇప్పుడు టిడిపి అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటుతోంది. కానీ ఇంతవరకు రాయపాటి సాంబ శివరావుకు ఎటువంటి పిలుపు లేదు. దీంతో రాజకీయాలనుంచి నిష్క్రమించడమే మేలని ఆ కుటుంబం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. చూడాలి వారి నిర్ణయం ఎలా ఉంటుందో?

# గొట్టిపాటికి కలిసి రాని కాలం



**విజయవాడ-సూర్య వాస్తవం, అక్టోబరు 13:** కొందరు మంత్రుల తీరుతో సీఎం చంద్రబాబు అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. నిన్న జరిగిన క్యాబినెట్ సమావేశంలో సీఎం ఫైర్ అయినట్లు సమాచారం. ముఖ్యంగా విద్యుత్ శాఖపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల చార్జీలు తగ్గించిన సంగతి తెలిసిందే. ట్రూ డౌన్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం చార్జీలను తగ్గించింది. చార్జీలు తగ్గించడం ఉమ్మడి ఏపీలో ఇదే తొలిసారి. కానీ దీనిపై విద్యుత్ శాఖ ప్రజల్లోకి బలంగా వెళ్లకపోవడంపై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున చార్జీలు తగ్గిస్తే ప్రచారం చేసుకోకపోతే ఎలా అంటూ క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు ప్రశ్నించినట్లు తెలుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దుష్ప్రచారం చేస్తుంటే ఏం చేస్తున్నారు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ ను చంద్రబాబు మందలించినట్లు తెలుస్తోంది.వాస్తవానికి క్యాబినెట్ సమావేశం జరిగిన ప్రతిసారి మంత్రుల వ్యవహార శైలి చర్చకు వస్తోంది. కొంతమంది మంత్రులకు ఉద్వాసన తప్పదని ప్రచారం జరుగుతోంది. కానీ కూటమి అధికారంలోకి వచ్చి 16 నెలలు మాత్రమే అవుతోంది. సాధారణంగా మంత్రివర్గ విస్తరణ అనేది రెండేళ్లకు ఒకసారి జరుపుతారు. గత వైసిపి ప్రభుత్వం అయితే అధికారంలోకి వచ్చిన మూడేళ్ల తరువాత విస్తరణ చేపట్టింది. కానీ చంద్రబాబు సర్కార్లో అధికారంలోకి వచ్చిన మూడు నెలల తరువాత నుంచి వింత ప్రచారం జరిగింది. మంత్రుల మార్పు ఉంటుందన్నది దాని సారాంశం. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది.అయితే తాజాగా విద్యుత్ చార్జీలకు సంబంధించి ప్రజలకు చెప్పుకోవడంలో విఫలమయ్యా మన అసంతృప్తి చంద్రబాబులో కనిపిస్తోంది. దీనిపై సంబంధిత మంత్రి గొట్టిపాటి రవికుమార్ పై చంద్రబాబు ఆగ్రహంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే క్యాబినెట్ సమావేశం జరిగిన ప్రతిసారి ఇటువంటి ప్రచారం జరగడం సర్వసాధారణంగా మారింది. ఇందులో ఎంత మాత్రం నిజం లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కోస్తా, రాయలసీమ జిల్లాల నుంచి నలుగురు మంత్రులపై వేటు అని ఎప్పటినుంచో ప్రచారం సాగిస్తున్నారు. కానీ ప్రభుత్వం మాత్రం అటువంటి చర్యలకు దిగలేదు. ఇప్పుడు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పై వేటు అంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే రాజకీయంగా ఆయన బలమైన నేత. ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకునే అవకాశమే లేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కూటమిలో మద్యం ప్రకంపనలు

**తిరుపతి-సూర్య వాస్తవం, అక్టోబరు 13:** ఏపీలో నకిలీ మద్యం ప్రకంపనలు సృష్టించింది. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలో నకిలీ మద్యం శిబిరం వెలుగులోకి వచ్చింది. ఎక్సైజ్ అధికారుల తనిఖీలో బయటపడింది. ఈ నకిలీ మద్యం తయారీలో సంబంధం ఉన్నట్టు ఆరోపణలు రావడంతో తంబళ్లపల్లె టిడిపి ఇన్చార్జ్ జయ చంద్రారెడ్డి పై పార్టీ వేటు వేసింది. మరో నేతపై కూడా టిడిపి హై కమాండ్ చర్యలు తీసుకుంది. అయితే దీనిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రచార అస్త్రంగా మార్చుకుంది. అయితే నకిలీ మద్యం పై ఆరోపణలు వచ్చిన వెంటనే తాము చర్యలు తీసుకున్నామని.. ఈ నిందితులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల తో ముందస్తు ఒప్పందం కుదిరింది అన్న అనుమానాలు ఉన్నాయి. అయితే ఇవేవీ పట్టించుకోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అదే పనిగా ప్రచారం చేస్తోంది. అయితే దీనిపై కేవలం టిడిపి నేతలు కౌంటర్ ఇస్తున్నారు. బిజెపితో పాటు జనసేన నేతలు స్పందించక పోవడం కూటమిలో ఉన్న గ్యాప్ ను తెలియజేస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది మూడు పార్టీల మధ్య సమన్వయం బాగానే నడిచింది. ఇది ఉమ్మడి ప్రభుత్వం కావడంతో ఏ పార్టీపై రాజకీయంగా విమర్శలు వచ్చినా.. తిప్పి కొట్టాల్సిన అవసరం మూడు పార్టీలపై ఉంది. గతంలో చాలా పరిణామాల విషయంలో మూడు పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాయి. కానీ ఇప్పుడు నకిలీ మద్యం వ్యవహారంలో మాత్రం తెలుగుదేశం పార్టీని టార్గెట్ చేస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ దానిని అడ్డుకోవడంలో కేవలం తెలుగుదేశం మాత్రమే ముందుంటోంది. ఈ విషయంలో బిజెపితో పాటు జనసేన నేతలు పెద్దగా కలుగజేసుకోవడం లేదు. దీనిని ఛాన్స్ గా తీసుకుంటోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అదే పనిగా టిడిపి పై వ్యతిరేక ప్రచారం చేస్తోంది కూటమి మరో 15 ఏళ్ల పాటు కొనసాగాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ బలంగా కోరుకుంటున్నారు. తెలుగుదేశం పార్టీతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని సూచిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. కూటమిలో తాము ఉన్నామన్న విషయాన్ని మూడు పార్టీలు మరిచిపోతున్నాయి. ఆ పార్టీపై




ఆరోపణలు వచ్చాయి కదా.. తామెందుకు స్పందించాలన్న రీతిలో జనసేనతో పాటు బిజెపి నేతలు ఉన్నారు. నకిలీ మద్యం వ్యవహారంలో టిడిపి నేతల పేర్లు బయటకు వచ్చాయి. వారిపై చర్యలు తీసుకుంది పార్టీ నాయకత్వం. గత వైసిపి ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు భిన్నంగా చంద్రబాబు ముందుగానే చర్యలకు ఉపక్రమించారు. కానీ ఎందుకో ఈ విషయంలో జనసేనతో పాటు బిజెపి నుంచి సహాయ నిరాకరణ ఎదుర్కొంటోంది తెలుగుదేశం పార్టీ. ఇలానే ముందుకు సాగితే కూటమిలో ఇబ్బందికర పరిస్థితులు రావడం ఖాయం.

**రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు**

నకిలీ మద్యం కేసు రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు ప్రస్తావించారు పోలీసులు. కల్తీ మద్యం కేసులో కింగ్ పిన్ జనార్ధన్ రావు 2012 నుండి లిక్కర్ వ్యాపారం ప్రారంభించారు. ఒఔఖీ బార్ ను నిర్వహిస్తున్నారు. లాభాలు వస్తున్న సమయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలతో హైవే మీద ఉన్న ఒఔఖీ బార్ ఇతర ప్రదేశానికి మార్చారు. వ్యాపారంలో పోటీ పెరగడం, దీనికి కరోనా తోడవడంతో 2021 వరకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడ్డారు. 2021 నుండి నకిలీ మద్యం తయారీ వ్యాపారం ప్రారంభించారు.మొట్టమొదటిగా హైదరాబాద్ నిజాంపేటలో ఒక గది అద్దెకి తీసుకొని కల్తీ మద్యం తయారీ చేశారు. మద్యాన్ని 35 లీటర్ల ప్లాస్టిక్ డబ్బాలో నింపి.. నకిలీ ఇన్వాయిస్ లతో విజయవాడ ఇబ్రహీంపట్నం పంపించే వాడు. అక్రమ మద్యం డబ్బాలపై ఫినాయిల్ స్టిక్కర్ వేసి ఆర్టీసీ కొరియర్ ద్వారా ఇబ్రహీంపట్నం చేరవేసే వాడు. ప్లాస్టిక్ డబ్బాల్లో మద్యం ఉన్నా ఎటువంటి అనుమానం తలెత్తేది కాదు. కేసులో ం5 నిందితుడు హాజీ దాన్ని రిసీవ్ చేసుకునే వాడు. ఈ అక్రమ మద్యాన్ని లీటర్ బాటిల్ లో తన బార్ లో లూస్ విక్రయాలు చేయటం వల్ల పెద్దగా అనుమానం కలగలేదని రిమాండ్ రిపోర్టులో పొందుపరిచారు. 2022లో ఇ 7 పేరుతో మరో ఆరుగురితో కలిసి హైదరాబాద్ లో మరో కొత్త బార్ ప్రారంభించాడు జనార్ధన్. అక్కడి నుండి 35 లీటర్ల బాటిల్స్ లో అక్రమ మద్యం తీసుకొచ్చి ఇబ్రహీంపట్నం ఒఔఖీ బార్ లో అమ్మడం జరిగింది. 2023 జనవరిలో ఆరుగురు భాగస్వాములతో కలిసి గోవా వెళ్లాడు జనార్ధన్ రావు.గోవాలో తెలుగు వ్యక్తి (ఈ కేసులో ం3) బాలాజీ లిక్కర్ స్టోర్ లో జనార్ధన్ కు పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి ఇద్దరూ రెగ్యులర్ టచ్ లో ఉన్నారు. ఏపీ లో లిక్కర్ ధరలు ఎక్కువగా ఉండడంతో గోవా నుండి ఖరీదైన లిక్కర్ బ్రాండ్ కొనుగోలు చేస్తున్నారని జనార్ధన్ కు చెప్పాడు బాలాజీ. గోవాలో దొరుకుతున్న ఖరీదైన మద్యం మాదిరి నకిలీ మద్యాన్ని ఏపీకి పంపిస్తానని జనార్ధన్ కు ప్రతిపాదించాడు బాలాజీ.డిస్టలరీస్ తో బాలాజీకున్న పరిచయాలతో క్యారమిల్, స్పిరిట్ ఇతర ముడి పదార్థాలు పంపగా 2023 నుండి ఇబ్రహీంపట్నం ఒఔఖీ బార్ లో కల్తీ మద్యం తయారీ ప్రారంభించాడు జనార్ధన్ రావు. 2023 ఏప్రిల్ నుండి కల్తీ మద్యం తయారీ వ్యాపారం ప్రారంభించాడు జనార్ధన్ రావు. నకిలీ లేబుల్స్ కేసులో ం4గా ఉన్న రవి హైదరాబాద్ నుండి సరఫరా చేశాడు. బాటిల్స్ మూతలు హైదరాబాద్ నుండి సరఫరా చేశాడు దారబోయిన ప్రసాద్.బెంగుళూరు, ముంబై, ఢిల్లీ నుండి ఏపీకి జనార్ధన్ కు ఐరిష్ వ్యాన్ లో సరఫరా చేశాడు బాలాజీ. ఒఔఖీ బార్ లో ఒకరోజు ఉండి కల్తీ మద్యం కోసం మిశ్రమం తయారు చేశాడు బాలాజీ. తర్వాత మిశ్రమం సాయంతో జనార్ధన్ రావు సోదరుడు జగన్ మోహన్ మంజీర విస్కీ, కేరళ మార్ట్ విస్కీ, ఓల్డ్ అడ్మినరల్, క్లాసిక్ బ్లూ వంటి కల్తీ మద్యం తయారు చేశాడు.మొదట కల్తీ మద్యం బాటిల్స్ ఒఔఖీ బార్ లో నే విక్రయించారు. ఒక్కో క్వార్టర్ బాటిల్ పై 40 రూపాయలు లాభం గడించాన జనార్ధన్ రావు. 2024 ఎన్నికల సమయంలో నిఘా పెరగడంతో బాలాజీ స్పిరిట్ సరఫరా చేయలేదు. కొత్తగా ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరవడంతో కల్తీ మద్యం కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేశాడు జనార్ధన్ రావు. తంబళపల్లి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జయచంద్రారెడ్డికి జనార్ధన్ రావు స్నేహితుడు. టీడీపీ నేత జయచంద్రారెడ్డి అనుచరుడు సురేంద్ర నాయుడు, జయచంద్రారెడ్డి పీఏ రాజేశ్ వైన్ షాపులు కొనుగోలు చేశారు. ములకలచెరువుకు చెందిన బాలగిరి సిద్దా ద్వారా రాజేష్, సురేంద్రతో స్నేహం చేశాడు జనార్ధన్ రావు. వారికి మద్యం వ్యాపారంలో అనుభవం లేకపోవడంతో వ్యాపారంలో నష్టం చవిచూశారు. దాంతో షాపులు జనార్ధనరావు పర్యవేక్షణ చేయమన్నారు. 2025 మే, జూన్ లో ములకలచెరువులో కల్తీ మద్యం తయారీ ప్రారంభించాడు జనార్ధన్ రావు. అదే సమయంలో ఇబ్రహీంపట్నంలో కూడా కల్తీ మద్యం తయారీ వ్యాపారం ప్రారంభించి విక్రయాలు జరిపాడు. జయచంద్రారెడ్డి ఆఫ్రికాలో ఉన్నాడని తెలిసి అక్కడికి గత నెల 25న వెళ్ళాడు జనార్ధన్ రావు. ఆఫ్రికాలోని రువాండలో జనార్ధన్ ఉన్న సమయంలో ములకలచెరువు, ఇబ్రహీంపట్నంలో కల్తీ మద్యం తయారీపై దాడులు నిర్వహించారు. అది తెలుసుకుని జనార్ధన్ ఇండియాకు వచ్చాడు" అని రిపోర్టులో పొందుపరిచారు.

# వైసీపీ నేతల్లో అసంతృప్తులు

విజయవాడ-సూర్య వాస్తవం, అక్టోబరు 13: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పరిస్థితులు క్షణం క్షణం మారిపోతున్నాయి. ఏపీలో ఎన్నికల ఫలితాల తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటమి పాలవడంతో ఆ పార్టీలో కీలకంగా పనిచేసిన పలువురు నేతలు అధికార కూటమి వైపు మొగ్గు చూపారు. ఆ సమయంలో ఆ పార్టీ భవిష్యత్తు లేదని భావించిన నేతలు, వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ స్థిరత్వం కోసం టిడిపి జనసేన పార్టీలలో చేరారు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారినట్లు తెలుస్తోంది. తాజాగా ఆ నేతల్లో కొందరు మళ్లీ వైసీపీ వైపు మొగ్గుచూపుతున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.జిల్లాల వారీగా చూస్తే, వైసీపీని విడిచి వెళ్లిన వారిలో చాలా మంది కొత్త పార్టీల్లో సరైన గుర్తింపు పొందలేదనే భావన కలిగింది. ముఖ్యంగా మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి , ఆళ్ల నాని, మోపిదేవి వెంకటరమణ వంటి నేతలకు కూటమి ప్రభుత్వంలో పెద్దగా ప్రాధాన్యం దక్కలేదని అంటున్నారు. ఒకప్పుడు జిల్లాల్లో ప్రభావవంతమైన నేతలుగా ఉన్న వీరు ఇప్పుడు కొత్త పార్టీల్లో రెండో శ్రేణి నేతలుగా మారిపోయిన పరిస్థితి ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.మరోవైపు మాజీ ఎమ్మెల్యేలు ఉదయభాను, కిలారు రోశయ్య , పెండెం దొరబాబు వంటి వారు తమ స్థాయిని నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నా, పార్టీ అంచనాలకు తగ్గ గుర్తింపు అందలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదయభాను ఎన్టీఆర్ జిల్లా జనసేన అధ్యక్షుడిగా పని చేస్తున్నప్పటికీ, పెద్దగా రాజకీయ ప్రభావం చూపలేకపోయారు. ఇదే సమయంలో దొరబాబు పిఠాపురం ప్రాంతంలో యాక్టివ్‌గా ఉన్నప్పటికీ, ఆయనకూ పెద్దగా అవకాశాలు రాలేదు.వైసీపీకి చాలా కాలం సన్నిహితుడిగా



ఉన్న మాజీ ఎంపీ వి. విజయసాయిరెడ్డి అయితే రాజకీయ సన్యాసం ప్రకటించి పూర్తిగా పార్టీకి దూరమయ్యారు. కానీ పార్టీని విడిచి వెళ్లిన ఇతర నేతలు మాత్రం ఇప్పుడు మళ్లీ పాత గూటికి చేరాలా అనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు ఇప్పటికే వైసీపీ నాయకులతో అనధికారికంగా సంప్రదింపులు ప్రారంభించినట్టు చెబుతున్నారు. మరికొందరు మాత్రం జగన్ మోహన్ రెడ్డి నుంచి ఆహ్వానం వస్తే తిరిగి చేరతామని భావిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం ఈ నేతల పరిస్థితి "ముందుకెళ్తే నుయ్యి, వెనక్కి వస్తే గొయ్యి" అన్నట్లు మారింది. కొత్త పార్టీల విధానం, పనితీరు తమ రాజకీయ ధోరణికి సరిపోకపోవడం వల్ల వారు అసహనంతో ఉన్నారని చెబుతున్నారు. తమ గత రాజకీయ జీవితం వైసీపీ, అంతకు ముందు కాంగ్రెస్ వాతావరణంలో సాగిందని, ఇప్పుడు కూటమి పార్టీల ధోరణి పూర్తిగా భిన్నంగా ఉందని కొందరు సన్నిహితుల వద్ద వాపోతున్నారని సమాచారం.ఇలా, ఈ రాజకీయ వలసదారుల భవిష్యత్తు ఏ దిశలో సాగుతుందో, నిజంగా ఎవరైనా మళ్లీ వైసీపీలో చేరుతారా లేదా అన్నది చూడాల్సిందే. కానీ ఈ ప్రచారం మాత్రం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊహాగానాలకు తావిస్తోంది.

# 15 నెలల్లో ఏడు ప్లాంట్లు..

## కంపెనీలను ఆకర్షిస్తున్న జిల్లా..

కర్నూలు-సూర్య వాస్తవం, అక్టోబరు 13: ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల కారణంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలోనే గత 15 నెలల కాలంలో ఏపీలో 12 వేలకోట్లకు పైగా పెట్టుబడులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు పలు సంస్థ ముందుకు వచ్చాయి. తాజాగా కర్నూలు జిల్లాలో రిలయన్స్ సంస్థ రూ.1700 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కర్నూలు జిల్లాలోనే ఏడు మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటు కానుండటం విశేషం.ఏపీలోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకుంటోంది. ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న పారిశ్రామిక విధానాల కారణంగా రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ రంగం గత 15 నెలల కాలంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. ఏపీలో ఎన్డీఏ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోకి రూ.12 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చినట్లు లెక్కలు చెప్తున్నాయి. ఏపీలో 12 వేల కోట్లకు పైగా పెట్టుబడులతో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు పలు సంస్థలు ముందుకు వచ్చాయి. ఇందులో ప్రధానంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ కర్నూలు జిల్లాలో రూ.1700 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయనుంది.మరోవైపు ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత కర్నూలు జిల్లాలో ఎక్కువగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు ఏర్పాటవుతున్నాయి. ఈ 15 నెలల కాలంలో ఏడు మెగా ఫుడ్ ప్రాసెసింగ్ ప్లాంట్లు కర్నూలులోనే ఏర్పాటు చేసేందుకు చర్యలు ప్రారంభం కావటం విశేషం. ఇటు హైదరాబాద్, అటు బెంగళూరుకు సమాన దూరంలో ఉండటం కర్నూలు జిల్లాకు కలిసి వస్తోంది. కర్నూలు నుంచి హైదరాబాద్ రోడ్డు మార్గంలో రావాలంటే



మూడు గంటలు సమయం పడుతుంది. అలాగే కర్నూలు నుంచి బెంగళూరుకు రోడ్డు మార్గంలో వెళ్లాలంటే ఐదు గంటలు పడుతుంది. ఈ నేపథ్యంలో కర్నూలు జిల్లావైపు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. రోడ్డు మార్గం ద్వారా ఉత్పత్తుల రవాణా సులభంగా, వేగంగా జరపవచ్చనే ఆలోచనతో కర్నూలు వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.కర్నూలు జిల్లాలోని ఓర్వకల్‌లో సాఫ్ట్ డ్రింక్స్, పండ్ల రసాల ప్లాంట్ ఏర్పాటు చేయాలనే రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రతిపాదనను ఏపీ కేబినెట్ ఇటీవల ఆమోదించింది. ఈ ప్లాంట్‌ను దాదాపు రూ.1,700 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్నారు. దీని ద్వారా దాదాపు 1,200 మందికి ఉపాధి దొరుకుతుందని అంచనా. పశువుల దాణా, గోతాముల తయారీలో ప్రముఖ సంస్థ ఒకటి గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 11 యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ కంపెనీ దాదాపు రూ. 450 కోట్లతో ఈ ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది.కుప్పం నియోజకవర్గంలో రూ.250 కోట్లతో మహిళా స్వయం సహాయక బృందం పాడి, పశువుల దాణా ప్లాంటును ఏర్పాటు చేస్తోంది. అలాగే కుప్పం నియోజకవర్గంలోని శాంతిపురంలో రూ.430 కోట్లతో మదర్ డెయిరీ పండ్ల ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తోంది. అలాగే ఏస్ ఇంటర్నేషనల్ రూ.750 కోట్లతో కుప్పం నియోజకవర్గంలో భారీ డెయిరీని ఏర్పాటు చేస్తోంది.మరోవైపు ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఏపీ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. పామాయిల్ తయారీలో ప్రముఖ సంస్థ ఒకటి రూ.250 కోట్లతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిఫైనరీ ఏర్పాటు చేయనుందని వెల్లడించారు. ఏబీఎస్ ప్రోటీన్స్ అనే సంస్థ రూ.400 కోట్లతో ఏపీలో చికెన్ వేస్ట్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసిందని వెల్లడించారు. ఎంఎస్ఎంఈ యూనిట్ల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ సెక్టార్‌లోక వేయి కోట్లు పెట్టుబడులు రాబట్టినట్లు మరో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వివరించారు.

## చిన్నారి కన్నీళ్లకు న్యాయం..

# నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష..



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** ఒక చిన్నారి జీవితాన్ని చీకటి మబ్బులు కప్పేశాయి.. మాయమాటలు చెప్పి ఆమె అమాయకత్వాన్ని దోచుకున్న నిందితుడు చివరికి చట్టం ముందు తలవంచాడు. మూడు సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత న్యాయం వెలుగులోకి వచ్చింది. బాధితురాలి కుటుంబం ఆవేదనతో రాసుకున్న ఫిర్యాదు ఇప్పుడు గర్వకారణమైంది. అన్నమయ్య జిల్లా పోలీసులు న్యాయాన్ని సాధించారు. 2021 మార్చి 3న బాసినికొండ గ్రామానికి చెందిన పి. ప్రసాద్ (23) అనే యువకుడు ఒక బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి మానభంగం చేశాడు. బాధితురాలి తల్లి 5 మార్చి న మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్‌కి చేరి కన్నీళ్లతో ఫిర్యాదు చేసింది. పోలీసులు వెంటనే స్పందించి చట్టం కింద కేసు నమోదు చేసి, విచారణ ప్రారంభించారు. చట్టం న్యాయం చెప్పింది. మూడు సంవత్సరాల విచారణ అనంతరం చిత్తూరు జిల్లా ఫోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. నిందితుడు పి. ప్రసాద్ నేరం రుజువైందని తేల్చి, 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.8 వేల జరిమానా విధించింది. తీర్పు వినగానే బాధితురాలి కుటుంబం కన్నీళ్లతో ఆనందం వ్యక్తం చేసింది. పోలీసుల కృషి వెనుక ఉన్న పట్టుదల.. ఈ కేసులో విచారణాధికారిగా శ్రీ కె. రవిమనోహర్ ఆచారి, అప్పటి మదనపల్లి డీఎస్పీ. కేసు నమోదు చేసిన అధికారి ఎస్ఐ దిలీప్ కుమార్, (ప్రస్తుతం ముదివేడు) మదనపల్లి డీఎస్పీ ఎస్. మహేంద్ర, తాలూక సీఐ కళా వెంకటరమణ, కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఈ. వెంకటరమణ, లైజన్ అధికారి టి.సి. సాయి సుధాకర్ సమన్వయంతో కేసు చివరి దశకు చేరింది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, శ్రీమతి వి.మోహన కుమారి వాదనలు సమర్థవంతంగా వినిపించగా, ఫోక్సో న్యాయమూర్తి శ్రీ ఎం.శంకర్ రావు నిందితుడికి శిక్ష విధించారు. ఇలాంటి వారిని చట్టం వదలదు" ఎస్పీ ధీరజ్ కునుబిల్లి. "మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు చేసే వారెవరైనా చట్టం ముందు తప్పించుకోలేరు. ఈ తీర్పు సమాజానికి గుణపాఠం కావాలి. బాధితులకు న్యాయం జరిగే వరకు పోలీసులు వెనక్కి తగ్గరు," అని అన్నమయ్య జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ పేర్కొన్నారు. కేసు విజయవంతంగా పూర్తిచేసిన పోలీసు అధికారులను, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ని, సమయానికి సాక్షులను కోర్టులో హాజరపరిచిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

**మహిళా, బాలల రక్షణకు పోలీసుల కఠిన కవచం**

ఎస్పీ పర్యవేక్షణలో "గుడ్ ట్రయల్ మానిటరింగ్ వ్యవస్థ" బలోపేతం అవుతోంది. ప్రతి కేసును సాక్ష్యాలతో, నిష్పక్షపాతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడం ద్వారా అన్నమయ్య పోలీసులు న్యాయాన్ని సాక్షాత్కారంగా నిలబెడుతున్నారు.

# ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట వైసీపీ ధర్నా



**గుత్తి సూర్య వాస్తవం అక్టోబర్ 13 :** గుత్తి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు గుంతకల్ నియోజకవర్గం సమన్వయకర్త వై.వెంకట్రా మిరెడ్డి ఆదేశాల మేర కు గుత్తి పట్టణం మండల కన్వీన ర్లు కె.మధుసూదన్ రెడ్డి గంగరా జు యాదవ్ అధ్యక్షత నా నిర్వ హించిన ధర్నా,నిరసన కార్యక్ర మంలో పాల్గొన్న జిల్లా ఉపాధ్య క్షురాలు వై నైరుతి రెడ్డి మరియు మున్సిపల్ చైర్మన్ వన్నూర్ బి ఎంపీపీ గండ్లపాటి విశాలాక్షి మా జీ జడ్పీటీసీ ప్రవీణ్ కుమార్ యా దవ్ నియోజకవర్గ మహిళ అధ్య క్షురాలు వరలక్ష్మీ యాదవ్ మాజీ కన్వీనర్లు హుసేన్ పిరా గోవర్ధన్ రెడ్డి,మరియు జిల్లా మహిళ నా యకురాలు డా.శాంతి ప్రియ,తో ట శ్రీదేవి,టౌన్ మహిళ కన్వీనర్ హేమలత రెడ్డి రాష్ట్ర జిల్లా సీని యర్ నాయకులుమైనుద్దీన్,సీవీ రంగా రెడ్డి,గురుప్రసాద్ యాదవ్, సుభాష్ రెడ్డి,వైపి బాబు,రంగ స్వామి,రాజశేఖర్ రెడ్డి వైఎండ్ ఫాయాజ్,ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తం గా కూటమి ప్రభుత్వం పెద్దల స హకా రంతో కల్తీ మద్యం ప్రతి వైన్ షాపులో పుష్కలంగా లభిస్తుం ద ని దాన్ని సేవించిన ప్రజలు అనా రోగ్యంతో,మృత్యువాత పడుతు న్నారు.అన్ని ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆ డుతున్నారని.కల్తీ మద్యమును అరికట్టే విధంగా ఎక్సైజ్ అధికారు లు చర్యలు తీసుకోవాలని మెమ రాండం ఇవ్వడం జరిగింది,రా ష్ట్రంలో జరుగుతున్న కల్తీ మద్యం తయారీలో సూత్రదారులు,పాత్ర దారులను వెంటనే అరెస్ట్ చేయా లనీ నిరసన తెలుపుతూ గుత్తి పట్టణంలో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ఎదుట వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేయటం జ రిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొ న్న మున్సిపల్ కౌన్సిలర్లు వాల్మీకి శివ రాం,వరదరాజులు,కె వి రమ ణ,నరేష్,దస్తగిరి,హమ్మలి రామం జి,రమేష్ రెడ్డి,సర్పంచులు ధర్మ పురం చంద్ర,బ చూపల్లి రమేష్ బాబు నా యుడు,మముదూర్ రా మాంజనేయులు లక్ష్మి కాంత్ రెడ్డి ఎంపీటీసీ ఈరన్న గౌడ్,లలే ప్ప,మహిళల నాయకురాలు లా వణ్య రెడ్డి భాగ్యలక్ష్మి సుజాత వెంకటలక్ష్మి లక్ష్మీదేవి కరిష్మా సు గుణ విజయలక్ష్మి వైస్సార్సీపీసీ నియ ర్ నాయకులు మున్నవర్ (మున్నా)నెమతబాదు రఘునా థ్ రెడ్డి,బలరాముడు,కటిక అన్వ ర్,రామ రంగారెడ్డి,షఫీ మల్లికార్జు న,పుట్లల సునీల్ కుమార్,గోపి రె డ్డి,బేల్దారి చంద్ర మచినేని ప్రసా ద్,డి.శ్రీనివాస్ లు,బ్రహ్మ కుమా ర్,తపేలమురళి,చిన మధురె డ్డి,బళ్లారి హరినాథ్ రెడ్డి,కొత్తపేట బి,సురేష్,డి సురేష్,రమణ,గోవ ర్ధన్,కుమేత రాజశేఖర్ రెడ్డి,వై స్సార్ రాజు,అబ్దుల్ రౌఫ్,బేల్దారి అన్వర్,బేతపల్లి వెంకటేశ్వర రె డ్డి,చంద్రప్ప,చిన్నపులప్ప,ప్రతా ప,క్రిష్టప్ప,శ్రీనివాస్ రెడ్డి.మాజీ ఎం పీటీసీ రామచంద్ర,సురేష్,ఆంజ నేయులు నారాయణ,చంద్ర జక లచేరువుఆర్.రంగస్వామి,గోపాల్ ఇబ్రహీం,నాగరాజు, శివశంకర్, బాషా,రమణ, ఆంజనేయులు,చంద్ర,రాజు,మురళి,రమేష్, టి,కొత్తపల్లి చంద్ర,తురకపల్లి రంగస్వామి రె డ్డి,రామిరెడ్డి,హనుమంత్ రెడ్డి,పా లశి వ శంకర్ శ్రీపురం మహాలిం గా,జేపీగాదిలింగా, యాగంటి,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడేళ్ల తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు

# కొత్త ఉపాధ్యాయులు వచ్చారు

- పలు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- నూతన ఉపాధ్యాయులకు ఆల్ ది బెస్ట్ చెప్పిన ఎమ్మెల్యే
- విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని సూచించిన ఎమ్మెల్యే దగ్గుపాటి
- వైసిపి ప్రభుత్వం ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ కూడా లేదన్న దగ్గుపాటి



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** రాష్ట్రంలో ఏడేళ్ల తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయులు వచ్చారని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన నూతన ఉపాధ్యాయులు ఇవాళ పాఠశాలలకు తొలిసారిగా వచ్చారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే దగ్గుపాటి అనంతపురం నగరంలోని పలు పాఠశాలలకు వెళ్లి నూతన ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని పొట్టి శ్రీరాములు ఉన్నత పాఠశాల, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఉన్నత పాఠశాలలకు ఎమ్మెల్యే దగ్గుపాటి స్వయంగా వెళ్లారు. వారిని పలకరిస్తూ ఆల్ ది బెస్ట్ చెప్పారు. నూతన ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. నూతన యువ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సత్కరించారు. రాష్ట్రంలో 2018 తర్వాత ఇప్పటివరకు ఒక్క డీఎస్సీ కూడా రాలేదన్నారు. గత వైసిపి ప్రభుత్వం లో 2019 లోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని హామీ ఇచ్చి.. మాట తప్పారన్నారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాగానే తొలి సంతకం మెగా డీఎస్సీ పైన పెట్టారన్నారు. కేవలం ఐదు నెలల్లోని ప్రక్రియను పూర్తి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కు మాత్రమే దక్కుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 16,347 మంది కొత్త పాఠశాలలకు వెళ్లారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 57 మంది కొత్త ఉపాధ్యాయులు వచ్చారన్నారు. ప్రస్తుతం వారిలో చాలా ఆనందం కనిపిస్తోందని అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని డీఎస్సీలు ఉంటాయని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో 10 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడింది తీసుకొచ్చారని.. 10 లక్షల ఉద్యోగాలు కూడ వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎంఈఓ వెంకటస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల పక్షాన

# చట్టబద్ధంగా పోరాడతాం..!

- వారంలోపు అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాల్సిందే
- లేదంటే రిజిస్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- పాపంపేట పరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో ఉద్యమబాట
- పాపంపేట నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ
- తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** కబ్జాదారుల నుంచి పాపంపేటను కాపాడుకుందాం అని రాప్తాడు మాజి ఎమ్మెల్యే,నియోజకవర్గం సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. పాపంపేట పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బాధితులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బాధితులకు మాజి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మద్దతు ప్రకటించారు. కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ కబ్జాదారులు ఎమ్మెల్యే పరిటాల సునీత బంధువులే. పాపంపేట పొలం శోత్రియం భూములకు సంబంధించి రాచూరి వెంకటరమణశాస్త్రి, రాచూరి సుబ్రమణ్యంశాస్త్రి కుటుంబాలకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. వారివద్ద ఎలాంటి నెల్లూరు సెటిల్‌మెంట్ పట్టాలూ లేవన్నారు. అయినా వారి వారసులతో జిపిఎ చేయించుకుని భూముల్లోకి వస్తున్నారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వేలాది కోట్ల రూపాయల వసూళ్లకు తెగబడేందుకు ప్రణాళిక రచించారు. నెల్లూరు సెటిల్ మెంట్ పట్టాలు పొంది, ఆ తర్వాత రిజిస్ట్రేషన్లు చేసుకున్నవారే. కొనుగోలుదారులు బ్యాంకుల్లో కుదవ పెట్టి రుణాలు పొంది ఇళ్లుకూడా కట్టుకున్నారు. అన్ని రికార్డులు సక్రమంగా ఉంటేనే బ్యాంకులు రుణాలు ఇస్తాయ్ను. అలాంటి భూములను ఎలా తప్పుడు రిజిస్టర్లు చేస్తారు. ఎమ్మెల్యే పరిటాల సునీత అండతోనే కబ్జాదారులు పాపంపేట భూములపై పడ్డారు. శోత్రియం భూముల యజమానులతో సునిత బంధువులు జీపీఏ చేయించుకున్నారు. ఖాళీ స్థలాలు ఎక్కడుంటే అక్కడ వాలిపోతున్నారు. ఇప్పటికే 300 ఎకరాల దాకా జిపిఎ చేసుకున్నారు. గ్రామాలు, కాలనీలు ఖాళీ చేయించేలా ఈ ప్రాంత వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వీరిదెబ్బకు 10 వేల కుటుంబాలు బిక్కుబిక్కుమంటుయి. వారంలోపు అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దు చేయాల్సిందే. లేదంటే బాధితులతో కలిసి రిజిస్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. చట్టపరంగా పోరాడి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

### ముస్సిపల్ కమిషనర్‌ను

## సన్మానించిన తెదేపా నేతలు



**కుప్పం, సూర్య వాస్తవం అక్టోబర్ 13 :** కుప్పం మున్సిపాలిటీని అత్యుత్తమంగా తీర్చిదిద్ది రాష్ట్రస్థాయిలో ఉత్తమ అవార్డు పొందిన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ వి శ్రీనివాసరావును తెదేపా నేతలు సోమవారం ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శుభ్రతకు పెద్దపీట వేస్తున్నారని వారు తెలిపారు. మురుగు కాలువలలో ఎన్నో ఏళ్లుగా పేరుకున్న చెత్తను పోగుచేసి డంపింగ్ యార్డ్ కు తరలించి సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ద్వారా మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచుకునే ప్రయత్నం చేశారని కొనియాడారు. తాగునీటి సరఫరా లో సమస్యలు ఎదురవకుండా నిత్య పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది పగలు రాత్రి అహర్నిశలు కష్టపడుతూ కుప్పం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంలో చెమటోడుస్తున్నారని వారు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది చేస్తున్న శ్రమను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉత్తమ అవార్డు తీసుకోవడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ప్రజా సేవలో మున్సిపల్ కమిషనర్ శ్రద్ధ పెట్టి పనిచేస్తున్నారని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ను సన్మానించిన వారిలో కుప్పం మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్లు జిఎం దాము, జాకీర్ అహ్మద్, మాజీ ఎంపిటిసి ఉమాపతి నేతలు బాలాజీ తదితరులు ఉన్నారు.

## సూపర్ జీఎస్టీ పై అవగాహన ర్యాలీ




**కణేకల్ సూర్య వాస్తవం, అక్టోబర్ 13 :** స్థానిక గ్రామపంచాయతీ ఎంపీడీవో ఆఫీస్ నందు లేబర్ ఆఫీస్ ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుండి మెయిన్ బజార్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఆఫీసర్ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ ని కొన్ని వాటికి లేకుండా చేశారని దీన్ని ప్రజలు చాలా సంతోషిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం వారు గ్రామపంచాయతీ కార్యాలయం వారు మరియు సచివాలయ సిబ్బంది అందరూ పాల్గొన్నారు.

## నకిలీ మద్యంపై వెంటనే సిబిఐ దర్యాప్తు చేయాలి



**కణేకల్, సూర్య వాస్తవం అక్టోబర్ 13 :** వైసీపీ అధినేత వై.యస్ జగన్ మోహన్ రెడ్డి గారి పిలుపుమేరకు కణేకల్ పట్టణం నందు రాష్ట్ర వ్యాప్తంగా కుటీర పరిశ్రమలాగా నారా వారి నకిలీ మద్యంతో ప్రజలు ప్రాణాలు తీస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా కణేకల్ పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి నకిలీ మద్యం పై వెంటనే సీబీఐ దర్యాప్తు చేపించాలని వైసీపీ తరుపున డిమాండ్ చేస్తున్నామని అధికారులకు వినతిపత్రం అందజేశారు రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ మెట్టు విశ్వనాథ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో కణేకల్, మరియు బొమ్మనహల్ మండల సర్పంచులు ఎంపీటీసీలు మండల ప్రజా ప్రతినిధులు అనుబంధ విభాగాల అధ్యక్షులు మరియు నాయకులు కార్యకర్తలు వైసిపి కుటుంబ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**మదనపల్లె , సూర్య వాస్తవం:** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని అమ్మచెరువు మిట్టకు చెందిన పవన్ కుమార్, పల్లవి దంపతుల కుమారుడు అజయ్ దేవ్ (19) ఫ్లిప్ కార్ట్ లో పనిచేస్తున్నాడు. రాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలుదేరాడు. అమ్మచెరువు మిట్ట సమీపంలో వాహనం అదుపు తప్పడంతో, బోల్తా పడి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు కావడంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నకిలీ మద్యంపై ధర్నా




**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం అక్టోబర్ 13:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచ్చలవిడిగా నకిలీ మద్యం విక్రయాలు జరుగుతున్నయని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ మండిపడ్డారు. ఉదయం పత్తికొండ పట్టణంలో ఎక్సైజ్ కార్యాలయం ముందు పార్టీ శ్రేణులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రజల ప్రాణాలను పానంగా పెట్టి కూటమి ప్రభుత్వంలో నాయకులు అక్రమ మద్యం వ్యాపారం చేస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారు. అందులో భాగంగానే వైఎస్ఆర్సిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సంబంధిత అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. నకిలీ మద్యంపై కూటమి ప్రభుత్వం స్పందించి స్వచ్ఛందంగా సిబీఐ విచారణ కోరాలని డిమాండ్ చేశారు. స్థానికంగా ఎక్సైజ్ శాఖ కూడా మొద్దు నిద్ర విడాలని సూచించారు.పల్లెలు పట్టణాలు తేడా లేకుండా గుడి బడి సంబంధం లేకుండా వీధి వీధికి బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి నకిలీ మద్యాన్ని ప్రజలకు అమ్ముతూ వారి ప్రాణాలను బలిగొంటున్నారని మండిపడ్డారు. పత్తికొండ నియోజకవర్గం లో మద్ది కేర మండలంలోని యడవలి గ్రామానికి చెందిన పెద్దన్న అనే వ్యక్తి అనంతపురం జిల్లా గుంతకల్ పట్టణంలోని టిడిపి నాయకుడు బార్ నందు నకిలీ మద్యం తాగి చనిపోయిన సంఘటనపై ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు. నకిలీ మద్యాన్ని టిడిపి నాయకులు ఒక పరిశ్రమ లాగా వాడుకుంటూ నకిలీ మద్యం తయారు చేసి రాష్ట్రమంతా విస్తరించారని ఆరోపించారు అందుకు ఉదాహరణగా చిత్తూరు జిల్లా ములకలచెరువు విజయవాడ దగ్గర ఇబ్రహీంపట్నం నందు దొరికిన నకిలీ మద్యం డంపులే నకిలీ మద్యానికి ప్రత్యక్ష ఉదాహరణని తెలిపారు. కావున కూటమి ప్రభుత్వంలోని ముఖ్యులు పవన్ కళ్యాణ్ నారా లోకేష్ నకిలీ మద్యం పై స్పందించకపోవడం దారుణం అన్నారు.మా జగనన్న ముఖ్యమంత్రి ఉన్న సమయంలో నకిలీ మద్యం పై ఉక్కు పాదం మోపి ప్రజల ప్రాణాలను కాపాడిన ఘనత మాదేనని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గం లోని ఎస్ నాగరత్నమ్మ, శ్రీరంగడు, సోమశేఖర్, నారాయణదాసు, పెద్దహుల్తి నాగరాజు, జయచంద్రారెడ్డి, మల్లికార్జున,వైఎస్ఆర్ పార్టీ ఎంపీపీలు,జడ్పీటీసీలు, మండల కన్వీనర్లు,మహిళలు, సర్పంచులు,ఎంపిటిసి, నాయకులు,కార్యకర్తలు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### - జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, అక్టోబర్ 13 :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి.జి.ఆర్.ఎస్)కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అర్జీలను స్వీకరించారు.జిల్లా కలెక్టర్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మలోల, అనంతపురం డివిజనల్ ఫారెస్ట్ గురు ప్రభాకర్, స్పెషల్, డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్ ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, జడ్పి సిఈఓ శివశంకర్, ఫారెస్ట్ రేంజ్ అధికారి సీతాపతి నాయుడు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కళ్యాణ్ దుర్గం విభాగం దీపా ఆయా శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ... అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయా శాఖల పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా అర్జీలను నాణ్యతగా పరిష్కారం చేయాలన్నారు. అంతకుముందు సామాజిక వన విభాగం అటవీ శాఖ కు సంబంధించి ప్రత్యేక సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమం కింద జిల్లాలో ఆయా శాఖల పరిధిలో 2 నుంచి 3 లక్షల మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఒక శాఖకు 3 నుంచి 5 వేలు మొక్కలు నాటే లక్ష్యం ఇచ్చి వాటిని పూర్తి చేయాలని, సామాజిక వన విభాగం అటవీ శాఖ పరిధిలో 1.50 లక్షల మొక్కలు నాటాలన్నారు. గ్రీనరీ జిల్లాగా రూపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా జాతీయ రహదారులు , నీటి సౌకర్యం కలిగిన మొక్కలు నాటే విధంగా హెచ్ ఎన్ ఎస్ ఎస్ , మైనర్ ఇరిగేషన్ శాఖలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని తెలిపారు.పీఎం సూర్య ఘర్ పథకం కింద మున్సిపాలిటీలు, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలునిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వనం మనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా సామాజిక వన విభాగం ద్వారా ఆయా నర్సీలలో ప్రజలకు విరివిగా మొక్కలు పంపిణీ చేయడం జరుగుతుందని ప్రజలు తమకు కావలసిన మొక్కలను పొందవచ్చునని తెలిపారు. జిల్లాలో 24 25 సంవత్సరంలో సామాజిక వన విభాగం ద్వారా ఇప్పటివరకు 13 నర్సరీలలో దాదాపుగా 26 లక్షల మొక్కలను పెంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఇందులో 5 లక్షల మొక్కలను ప్రజలకు పంపిణీ చేశారని ఇంకనూ 21 లక్షల దాకా వివిధ రకాల మొక్కలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. సీతాఫలం, ఉసిరి, జామ ,నీలగిరి, సుంకేసరి, సీమ తంగేడు తదితర 15 రకాల మొక్కలు నర్సరీలలో ఉన్నట్లు తెలిపారు. మొక్కల పెంపకంలో భాగంగా విద్యాశాఖ పరిధిలో ఉన్న పాఠశాలలు కళాశాలల్లో, డి ఆర్ డి ఎ ద్వారా గ్రామాలలో మహిళ స్వయం సహాయక బృందాలతో మొక్కలు నాటించాలని, సహకార శాఖ ద్వారా గ్రామస్థాయిలో ప్యాక్స్ పరిధిలో అలాగే జిల్లా పంచాయతీ శాఖ, డ్వామా, పరిశ్రమలు , రవాణా శాఖ, మునిసిపల్ మరియు మండల పరిధిలో మొక్కలను నాటి వాటి సంరక్షణకు సమన్వయ సహకారాలతో ప్రజలను, స్వచ్ఛంద సేవా సంస్థలను, విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు.ఇందులో జిల్లా అధికారులు వారి పరిధిలోని ఉద్యోగులతో కోర్సులను పూర్తి చేసి ఐ ఘాట్ కర్మయోగి పోర్టల్ లో అప్లోడ్ చేయాలని, ఇందుకు సంబంధించి కింది స్థాయిలోఅవగాహనతక్కువగా ఉందని, ఉద్యోగులందరూ కోర్సులు పూర్తి చేయాలని, ప్రతి ఉద్యోగి నెలకు మూడు నుంచి ఐదు కోర్సులు చేయాల్సి ఉందని, వాటిలో ఎప్పటికప్పుడు పురోగతి సాధించాలన్నారు. కోర్టు కేసులకు సంబంధించి కౌంటర్లను ఆలస్యం చేయకుండా దాఖలు చేయాలని, ప్రాపర్ గా అఫడవిట్ చదివి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. కంటెంప్ట్ కేసులకు సంబంధించిన కౌంటర్లు కూడా సమయానికి దాఖలు చేయాలన్నారు. ఆయా శాఖల పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలదగ్గరకుతీసుకువెళ్లాలని, ఇందులో అలస్వతం వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు ,తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ముందు చెప్పిన హామీలే కాదు..

# చెప్పనవి కూడా అమలు చేస్తున్నాం

### అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్





అనంతపురం – సూర్య వాస్తవం, అక్టోబర్ 13: ఎన్నికల ముందు చెప్పిన హామీలే కాకుండా చెప్పనివి కూడా అమలు చేస్తున్న ప్రభుత్వం ఇది అని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. సూపర్ జీఎస్టీ–సూపర్ సేవ్ కార్యక్రమంలో భాగంగా అనంతపురం నగరంలో భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ఎస్.ఎస్.బి.ఎన్ కళాశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల మీదుగా సాగింది. ఎమ్మెల్యే జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. మున్సిపల్, కార్మిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, కార్మిక శాఖ అధికారులు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. జీఎస్టి తగ్గింపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఎన్నికల ముందు తాము జీఎస్టీ తగ్గిస్తామని ఎక్కడా హామీ ఇవ్వలేదని గుర్తు చేశారు. అయినప్పటికీ పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు చేయాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి మోడీ ఈ నిర్ణయం తీసుకున్న తర్వాత మొట్టమొదట మద్దతు పలికింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే అన్నారు. జీఎస్టి తగ్గింపు వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై 8 వేల కోట్ల రూపాయల భారం పడిందన్నారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు జీఎస్టీ తగ్గింపు వల్ల మేలు జరుగుతోందన్నారు. ముఖ్యంగా గతంలో ఉన్న నాలుగు స్లాబ్ లను రెండు స్లాబులుగా మార్చారన్నారు. కేవలం 5, 18 స్లాబులు మాత్రమే ఉన్నాయన్నారు. దీని వలన ఇప్పటికే ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, వ్యవసాయ రంగ పరికరాలు భారీగా ధరలు తగ్గాయన్నారు. వైద్యరంగంలో ఇన్సూరెన్స్ పూర్తిగా జీఎస్టి నుంచి మినహాయించారని..అలాగే మందుల ధరలు కూడా తగ్గాయన్నారు. ఇది ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం అని రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు ఇలాంటివి చూస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు.

# సర్వజనాసుపత్రిని 1200 పడకల ఆసుపత్రిగా మారుస్తాం

- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి
- 20 మందికి 22 లక్షల రూపాయల చెక్కులు అందజేత
- అనంతలో సామాన్యులకు మెరుగైన వైద్యం అందించాలన్నదే లక్ష్యం



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిని 1200 పడకల ఆసుపత్రిగా మారుస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 20 మందికి 22లక్షల 17వేల రూపాయల చెక్కులను అందజేశారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే దగ్గుపాటికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవలను రాష్ట్రంలో మరింత విస్తృతం అయ్యేలా చేస్తున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లోనూ లేదా ఎన్టీఆర్ వైద్య సేవలు అందని వారు ప్రైవేట్ ఆస్పత్రు ల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇలాంటి వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఒక్క అనంతపురం నియోజకవర్గంలోని ఇప్పటి వరకు మూడున్నర కోట్ల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇందులో భాగంగా అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం 560 పడకలు మాత్రమే ఉందని...దీనిని 1200 పడకలకు మార్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే డిపిఆర్ లు ప్రభుత్వానికి అందించినట్లు చెప్పారు. వైద్యం కోసం అనంతపురం నగరానికి తెలంగాణ ప్రాంతం నుంచి కూడా వస్తున్నారన్నారు.. సామాన్యుడికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## కుప్పం నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామిగా

# మన రోవర్ గ్రూప్ సంస్థ



**కుప్పం సూర్య వాస్తవం అక్టోబర్ 13 :** కుప్పం నియోజకవర్గ అభివృద్ధిలో ప్రముఖ రోవర్ ఇన్కొ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ భాగస్వామి కానుంది. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ జి. శివకుమార్ కుప్పం కడ అధికారులతో ఎం ఓ యు కుదుర్చుకున్నారు. ముఖ్యంగా రోవర్ గ్రూప్ సంస్థ కుప్పం నియోజకవర్గ పరిధిలోని రైతులు, మహిళలు, యువతకు నైపుణ్య శిక్షణ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ఇందులో భాగంగా ప్రస్తుత డిజిటల్ యుగానికి అనుగుణంగా వారిని నిష్ణాతులుగా మార్చనుంది. ఈ రోవర్ గ్రూపు సంస్థ వ్యవసాయ దారులను మహిళలను పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా, తయారుచేసి వారి నైపుణ్యంతో స్వయంగా వ్యాపారంలో మెలకువలు నేర్చుకుని తమను తాము అభివృద్ధి చేసుకునేందుకు సంసిద్ధం చేయనుంది. కాగా మొదటి దశలో 100 మంది ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చి వారిని స్వయం ఉపాధి దిశగా తీసుకెళ్లే ప్రణాళిక రూపొందించినట్లు రోవర్ సంస్థ డైరెక్టర్ జి శివకుమార్ మీడియాకు తెలిపారు. అయితే వ్యవసాయదారులు పండించే పంటలకు గిట్టుబాటు ధర దక్కేలా చేయనుంది. ఆ పంట జీవిత కాలాన్ని పెంచుకునేలా చేసి వారికి వ్యాల్యూ అడిషన్ ద్వారా అధిక ధర దక్కేలా కృషి చేయనుంది. అంతేకాకుండా కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించాలనుకునే ఔత్సాహితులకు ఈ సంస్థ ఆలంబనగా మారనుంది.వారికి వ్యాపార మెలకువలను నేర్పించి వారు అత్యుత్తమ పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రోవర్ గ్రూప్ సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ డైరెక్టర్ జి శివకుమార్ తెలిపారు.

కాగా కడ అధికారులతో ఇటీవల చేసుకున్న ఒప్పందం మేరకు ఆ సంస్థ నియోజకవర్గ పరిధిలోని రైతులు మహిళలు యువతకు ఈ అవకాశాలను కల్పించి సద్వినియోగం చేసుకునేలా తమ కళాకారులను ప్రారంభించింది. కాగా యంవోయు ఒప్పంద కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్ మర్మత్, పీఎంకే ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, నియోజకవర్గ ఏఎంసీ అధ్యక్షులు జి.ఎం మునిరాజు, రెస్కో అధ్యక్షులు వీజీ ప్రతాప్ కుమార్, కుప్పం మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాణిపాకం వెంకటేష్, మాజీ జెడ్పిటిసి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కూటమిలో తప్పు చేసిన వారు వైసీపీ కోవర్టులా..!

### - కల్తీ మద్యంతో కూటమికి కౌంట్ డౌన్



**కమలాపురం-సూర్య వాస్తవం:** కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటాడడమే కాకుండా కూటమి ప్రభుత్వంలో తప్పు చేసిన వారు వైసిపి కోవర్ట్ లుగా కూటమి అగ్ర నాయకులు పేర్కొనడం వారి సిగ్గులేని తనానికి నిదర్శనమని వైసిపి రాష్ట్ర ఎస్ఈసి సభ్యుడు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ వైసిపి పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కూటమి ప్రభుత్వ పనితీరు పై ధ్వజమెత్తారు. కమలాపురం లోని వైసీపీ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైసీపీ నాయకులతో కలిసి వారు మాట్లాడారు. రాష్ట్రంలో కల్తీ మద్యంతో రాష్ట్ర ప్రభుత్వ పరువును కూటమి ప్రభుత్వం దిగదార్చిందన్నారు తెలుగుదేశం పార్టీ నాయకులు కల్తీ మద్యం రాష్ట్రవ్యాప్తంగా ఏరులై పారిస్తున్న ప్రభుత్వ యంత్రాంగం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండడం 40 సంవత్సరాల చంద్రబాబు రాజకీయ అనుభవం చివరకు చీప్ లిక్కర్ అమ్ముకోవడానికి ఉపయోగపడుతోందని వారు ఎద్దేవా చేసారు. జిల్లాకు చెందిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి చీప్ లిక్కర్ విషయంలో తాను కాణిపాకం వెళ్లి ప్రమాణం చేస్తా అనడం ఆయన అవినీతికి అద్దం పడుతుందన్నారు . చీప్ లిక్కర్ వ్యవహారంపై సిబిఐ విచారణకు ఆదేశించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు వెనకడుగు వేస్తోందని వారు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కల్తీ మద్యం వ్యవహార పై సిట్ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం గమనిస్తుంటే కేవలం వైసీపీ నాయకులను ఇందులో ఇరికించడానికి ఆయన పన్నుతున్న కుట్రగా వారు పేర్కొన్నారు .రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ మద్యం అని వైసిపి నాయకులపై అక్రమ కేసులు పెడుతున్న ప్రభుత్వానికి చీప్ లిక్కర్ వ్యవహారం చెంపదెబ్బ గా మారిందన్నారు .రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి భగవంతుడిని నమ్ముతాడని తప్పు చేసిన వారికి శిక్ష పడుతుందని ఆయన భావిస్తారనడానికి నిదర్శనం రాష్ట్రంలో అక్రమ మద్యం పేరుతో వైసిపి నాయకుల పై నిందలు వేసిన కూటమి ప్రభుత్వానికి చీప్ లిక్కర్ వ్యవహారమే భగవంతుడు ఇచ్చిన ప్రతీకార చర్యగా వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు రాజారెడ్డి కల్లూరు జనార్ధన రెడ్డి ఎంపీటీసీ నాగరాజా చారి మాజీ సర్పంచ్ లు దానం రమణ శ్రీనివాసుల రెడ్డి పెద్దచెప్పలి శేఖర్ కొండాయపల్లె రాయప్ప మాజీ ఎంపీటీసీ సుబ్బారెడ్డి జగన్నాథ రెడ్డి సుబ్బన్న చంటి చంద్రపాల్ పెద్ద చెప్పల్లి మాజీ సర్పంచ్ శేఖర్ పెద్ద చెప్పల్లి మాజీ సర్పంచ్ శేఖర్ నల్లింగాయపల్లె కొండారెడ్డి తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సదరం క్యాంపులు వాయిదా..




**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం, అక్టోబర్ 13 :** – ప్రధానమంత్రి నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటన మరియు పొరుగు జిల్లాల్లో జరుగుతున్న పరిపాలనా మరియు భద్రతా ఏర్పాట్ల దృష్ట్యా, నెల్లూరు, కడప, అనంతపురం మరియు ప్రకాశం జిల్లాల్లో 15.10.2025, 16.10.2025, 17.10.2025 తేదీలలో జరగాల్సిన అన్ని సదరం క్యాంపులు ( అప్పీల్ అసెస్మెంట్లను) వాయిదా వేయాలని నిర్ణయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ డా.కె.పద్మావతి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ తేదీలలో సదరం క్యాంపులకు హాజరు కావలసినదిగా ఇదివరకే నోటీసులు పొందిన పింఛనుదారులు ఈ వాయిదా విషయాన్ని గమనించాలని సూచించారు. సవరించిన షెడ్యూల్ను అందరు వికలాంగులకు ఎస్ఎంఎస్ మరియు ఇతర మార్గాల ద్వారా తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. సెర్ప్ మరియు జీఎస్డబ్ల్యూఎస్ సాంకేతిక బృందంతో సమన్వయంతో వాయిదా వేసిన సదరం క్యాంపులను తదుపరి అందుబాటులో ఉన్న తేదీలకు తిరిగి షెడ్యూల్ చేయాలని సూచించారు.

# గల్లంతైన విద్యార్థి మృతి

### - కన్నీరు మున్నీరుగా విలపించిన తల్లిదండ్రులు







**మదనపల్లి, సూర్య వాస్తవం:** మదనపల్లె బసినికొండ హంద్రీనీవా కాలువలో ఆదివారం ఈతకు వెళ్లి 10వ తరగతి విద్యార్థి సాయికిరణ్ (16) గల్లంతైన సంగతి తెలిసింది. సోమవారం ఉదయం సాయికిరణ్ మృతదేహం లభించింది. రామారావు కాలనీకి చెందిన సురేష్, సరళ దంపతుల కుమారుడు సాయికిరణ్ బసినికొండ అభ్యుదయ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం కూడ స్కూల్ యజమాన్యం స్పెషల్ క్లాసుల పేరుతో తరగతులు నిర్వహించడంతో పాఠశాల కు వెళ్లాడు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పక్కనే ఉన్న హంద్రీ-నీవా కాలువకు ఈతకు వెళ్లాడు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. రాత్రింబవళ్లు కుటుంబీకులు గాలింపు చేపట్టడంతో మృత దేహం లభ్యమైంది. బిడ్డ మృతదేహం వద్ద తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. వారు గుండెలు బాదుకుంటూ వెలిపించడం సూపర్ ల హృదయాలను తీవ్రంగా కలిసి వేసింది. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఆ మౌనానికి ప్రతిరూపమే 'సూపర్ సుబ్బు'

సందీప్ కిషన్ హీరోగా రూపొందిన కొత్త ప్రాజెక్ట్ సూపర్ సుబ్బు. చిలకా ప్రొడక్షన్స్ పతాకంపై మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ వచ్చే ఏడాది నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ. 'ఈ కథ ఆలోచన ఒక అబ్జర్వేషన్ నుంచి పుట్టింది. ఈ రోజుకీ సెక్స్ ఎడ్యుకేషన్ గురించి మనం ఇంకా గుసగుసలలోనే మాట్లాడుతున్నాం. తల్లిదండ్రులు దాన్ని దాటవేస్తారు. పాఠశాలలు విస్మరిస్తాయి, పిల్లలు అపోహలతో పెరుగుతారు. ఆ మౌనాన్ని ఒక కథగా మార్చాను. సుబ్రహ్మణ్యం అనే పాత్ర ద్వారా అవగాహనను ఎలా కలిగిస్తుందో ఇందులో చూడొచ్చు. మాఖీపూర్ ప్రజల అపోహలు, ఆప్యాయత.. ఇవన్నీ మనందరికీ తెలిసిన గ్రామ జీవనాన్ని గుర్తు చేస్తాయి' అని తెలిపారు. 'ఇది నేను ఇప్పటివరకు చేసిన ప్రాజెక్టుల కంటే పూర్తిగా భిన్నమైనది' అని నటి మిథిలా పాల్కర్ చెప్పారు. హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ, 'ఇప్పుడు మనం ఒక అందమైన కథా కాలంలో ఉన్నాం. కథలు మరింత ధైర్యంగా, భావోద్వేగంగా, మన జీవితాల్లో భాగంగా అనిపించేలా మారాయి. ఈ కథ విన్న వెంటనే ఇది చెప్పదగ్గ నిజమైన కథ అని నమ్మాను. పాత్రల ఉత్సాహం, రచనలోని హాస్యం..ఇవన్నీ సిరీస్ మొత్తాన్ని చిరునవ్వుతో నింపుతాయి' అని అన్నారు. ఈ సిరీస్‌కు నిర్మాత: రాజీవ్ చిలకా.

# అందరికీ కనెక్ట్ అయ్యే ఎంటర్‌టైనర్

సిద్ధు జొన్నలగడ్డ, శ్రీనిధిశెట్టి, రాశి ఖన్నా ప్రధాన పాత్రధారులుగా రూపొందిన మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్టైనర్ 'తెలుసు కదా'. స్టైలిస్ట్ నీరజా కోన దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిం చారు. ఈ సినిమా ఈనెల 17న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం మేకర్స్ ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.

హీరో సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ,'మీ అందరికీ ట్రైలర్ నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ట్రైలర్‌లో ఏం చూసారో సినిమాలో కూడా అదే క్యారెక్టర్, టోన్ కనిపిస్తుంది. టిల్లు లాంటి క్యారెక్టర్ నుంచి బయటికి రావాలంటే ఇలాంటి సినిమాలు చేయాలి. టిల్లు ఇన్నోసెంట్, కానీ 'తెలుసు కదా' అలా కాదు. ఇంటెలిజెంట్ క్యారెక్టర్. వరుణ్ క్యారెక్టర్ చాలా ఎంటర్టైనింగ్‌గా ఉంటుంది. ఇది యూత్‌కి, ఫ్యామిలీస్‌కి నచ్చే సినిమా' అని తెలిపారు.



'ఇది ఒక రాడికల్ సినిమా అవుతుంది. ఈ సినిమా చూసిన తర్వాత టిల్లుని మరిచిపోతారు. అంత నమ్మకం ఉంది' అని హీరోయిన్ రాశి ఖన్నా చెప్పారు. మరో హీరోయిన్ శ్రీనిధి శెట్టి మాట్లాడుతూ, 'ట్రైలర్ చూసిన తర్వాత చాలా రాడికల్‌గా అనిపించింది. సినిమా కోసం నేను చాలా ఎగ్జైటెడ్‌గా ఎదురు చూస్తున్నాను' అని అన్నారు.

డైరెక్టర్ నీరజ కోన మాట్లాడుతూ,'ఇది నా ఫస్ట్ ఫిలిం. నాకు చాలా స్పెషల్ సినిమా. ట్రైలర్‌లో మీరు చూసిన దానికి పది రెట్లు సినిమాలో ఉంది. గెట్ రెడీ ఫర్ ఫన్ రైడ్' అని తెలిపారు. 'ట్రైలర్‌లో కొంచెమే చూపించాము. సినిమాలో చాలా ఉంది. ఈనెల 17 అందరూ ఈ సినిమాని చూడాలని కోరుకుంటున్నాను' అని వైవా హర్ష చెప్పారు. ప్రొడ్యూసర్ కృతి ప్రసాద్ మాట్లాడుతూ, 'ఈ కథ వినగానే నచ్చింది. యూత్ ఆడియన్స్ కనెక్ట్ అవుతారు. ఈ సినిమాని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తున్న టీం విషయంలో ప్రౌడ్‌గా ఉంది' అని అన్నారు.

'మాకు ఈ అవకాశం ఇచ్చిన విశ్వప్రసాద్, కృతి ప్రసాద్‌కి ధన్యవాదాలు. ట్రైలర్ అదిరిపోయింది. ట్రైలర్ చూసిన తర్వాత సినిమా మీద అంచనాలు అద్భుతంగా పెరిగాయి' అని మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి చెప్పారు.

# యూనిక్ కథతో 'మేఘన'


'చిత్రం' శ్రీను, సుష్మ, రామ్ బండారు హీరో, హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'మేఘన'. సుధాకర రెడ్డి వర్ర దర్శకత్వం వహించారు. శ్రీ శివ సాయి ఫిలిమ్స్ బ్యానర్‌పై నంది వెంకట్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్ర పోస్టర్, టీజర్ లాంచ్ వేడుక ఫిల్మ్ ఛాంబర్‌లో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఈ సినిమా హీరో 'చిత్రం' శ్రీనివాస్ మాట్లాడుతూ, 'మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది.

నా ఖాతాలో మరో హిట్ పడు తుందని కచ్చితంగా చెప్పగలను. నాకు అవ కాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు' అని అన్నారు.

'ప్రధాన పాత్రలో నటించే అవకాశం ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉంది. మా నాన్న చనిపోయి మూడేళ్లు అవుతోంది.

ఆ తర్వాత నేను ఎప్పుడూ బర్త్‌డే సెలబ్రేట్ చేయలేదు. కానీ ఈ సినిమా ప్రెస్‌మీట్ సందర్భంగా పుట్టినరోజు జరుపు కోవడం ఎంతో భావోద్వేగంగా, ఆనందంగా అనిపించింది. ఈ మూవీ నా జీవితంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపుని తీసుకురాబోతుంది' అని హీరోయిన్ సుష్మ చెప్పారు.

దర్శకుడు సుధాకర రెడ్డి వర్ర మాట్లాడుతూ, 'చిన్న ప్రొడక్షన్ అయినా పెద్ద కలలతో ఈ సినిమా చేశాం. ఎన్నో ఇబ్బందులు ఎదురైనా, కేవలం రెండేళ్లలోనే చిత్రాన్ని పూర్తి చేయ గలిగాం. కథలో మానవ సంబంధాలు, భావోద్వేగాలు ప్రధానంగా ఉంటాయి. ప్రేక్షకులు తప్పకుండా కనెక్ట్ అవుతారని ఆశిస్తున్నాను'అని అన్నారు. 'సమాజానికి మంచి సందేశం ఇచ్చేలా, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి నచ్చేలా సినిమాని తీర్చిదిద్దాం. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే విధంగా కథ సాగుతుంది. త్వరలోనే విడుదల తేదీ ప్రకటిస్తాం. ఓ మంచి కథతో సినిమా తీసినందుకు సంతోషంగా ఉంది' అని నిర్మాత నంది వెంకట్ రెడ్డి చెప్పారు.





# క్లీన్‌స్వీప్‌కు మరో 58 పరుగులే

## భారత్ లక్ష్యం 121, ప్రస్తుతం 63/1

**: హెూప్, కాంప్‌బెల్ శతక పోరాటం, భారత్, వెస్టిండీస్ రెండో టెస్టు నాల్గో రోజు కరీబియన్లపై క్లీన్‌స్వీప్ విజయానికి భారత్ 58 పరుగుల దూరంలో నిలిచింది. 121 పరుగుల ఛేదనలో భారత్ ప్రస్తుతం 63/1తో నిలిచింది. రాహుల్ (25 నాటౌట్), సాయి సుదర్శన్ (30 నాటౌట్) అజేయంగా ఆడుతున్నారు. హెూప్ (103), కాంప్‌బెల్ (115) శతక పోరాటంతో విండీస్ ఫాలోఆన్‌లో 390 పరుగులు చేసి ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకుంది.**



**న్యూఢిల్లీ:** వెస్టిండీస్‌తో రెండు మ్యాచుల టెస్టు సిరీస్‌ను 2-0తో క్లీన్‌స్వీప్ చేసేందుకు భారత్ రంగం సిద్ధం చేసుకుంది. ఫాలోఆన్‌లో కరీబియన్ బ్యాటర్ల పోరాటంతో ఇన్నింగ్స్ విజయానికి దూరమైన భారత్.. నేడు ఉదయం సెషన్లోనే అదిరే విక్టరీ లాంఛనం చేసుకుంది. స్వల్ప ఛేదనలో యశస్వి జైస్వాల్ (8) అవుటైనా.. కెఎల్ రాహుల్ (25 నాటౌట్, 54 బంతుల్లో 2 ఫోర్లు), సాయి సుదర్శన్ (30 నాటౌట్, 47 బంతుల్లో 5 ఫోర్లు) రెండో వికెట్‌కు అజేయంగా 54 పరుగులు జోడించి భారత్‌ను విజయానికి చేరువ చేశారు. అంతకుముందు వెస్టిండీస్ ఫాలోఆన్‌లో 118.5 ఓవర్లలో 390/10 పరుగులు చేసింది. ఓపెనర్ జాన్ కాంప్‌బెల్ (115, 199 బంతుల్లో 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), షారు హెూప్ (103, 214 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) అసమాన సెంచరీలతో కదం తొక్కారు. భారత్, వెస్టిండీస్ రెండో టెస్టులో నేడు ఆఖరు రోజు.

### ఆ ఇద్దరు మెరువగా..

జాన్ కాంప్‌బెల్ (115), షారు హెూప్ (103) మూడో వికెట్‌కు 177 పరుగుల భారీ భాగస్వామ్యం నిర్మించారు. 49.1 ఓవర్ల పాటు భారత బౌలర్లకు వికెట్ నిరాకరించిన ఈ జోడీ.. విండీస్‌ను ఇన్నింగ్స్ ఓటమి ప్రమాదం నుంచి తప్పించింది. రోస్టన్ ఛేజ్ (40, 72 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), జస్టిన్ గ్రీవ్స్ (50 నాటౌట్, 85 బంతుల్లో 3 ఫోర్లు), జేడెన్ సీయల్స్ (32, 67 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ప్రతిఘటనతో భారత్ మరోసారి బ్యాటింగ్‌కు రావాల్సి వచ్చింది. 311/9తో ఉన్న విండీస్‌ను జేడెన్, జస్టిన్‌లు ఆఖరు వికెట్‌కు 79 పరుగులు జోడించి ఆకట్టుకున్నారు. భారత బౌలర్లలో కుల్‌దీప్, బుమ్రా మూడేసి వికెట్లు పడగొట్టారు.

### స్కోరు వివరాలు :

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 518/10
**వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్:** 248/10
**వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్:** కాంప్‌బెల్ (ఎల్బీ) జడేజా 115, చందర్‌పాల్ (సి) గిల్ (బి) సిరాజ్ 10, అలిక్ (బి) సుందర్ 7, హెూప్ (బి) సిరాజ్ 103, ఛేజ్ (సి) దేవదత్ (బి) కుల్‌దీప్ 40, ఇమ్లాచ్ (ఎల్బీ) కుల్‌దీప్ 12, జస్టిన్ నాటౌట్ 50, ఖారీ (సి) నితీశ్ (బి) కుల్‌దీప్ 0, వారికన్ (బి) బుమ్రా 3, ఫిలిప్ (సి) జురెల్ (బి) బుమ్రా 2, జేడెన్ (సి) సుందర్ (బి) బుమ్రా 32, **ఎక్స్‌ట్రాలు:** 16, **మొత్తం:** (118.5 ఓవర్లలో ఆలౌట్) 390.
**వికెట్ల పతనం:** 1-17, 2-35, 3-212, 4-271, 5-293, 6-298, 7-298, 8-307, 9-311, 10-390.
**బౌలింగ్:** సిరాజ్ 15-3-43-2, జడేజా 33-10-102-1, సుందర్ 23-3-80-1, కుల్‌దీప్ 29-4-104-3, బుమ్రా 17.5-5-44-3, జైస్వాల్ 1-0-3-0.
**భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి (సి) ఫిలిప్ (బి) వారికన్ 8, రాహుల్ నాటౌట్ 25, సుదర్శన్ నాటౌట్ 30, **మొత్తం:** (18 ఓవర్లలో 1 వికెట్‌కు) 63.
**వికెట్ల పతనం:** 1-9.
బౌలింగ్ : జేడెన్ 3-0-14-0, జోమెల్ 7-1-15-1, ఖారీ 6-0-24-0, ఛేజ్ 2-0-10-0.

# ఎదురులేని బెంగళూరు




**హైదరాబాద్:** ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాల్గో సీజన్‌లో బెంగళూరు టార్పెడోస్ జోరు కొనసాగుతుంది. సీజన్‌లో ఆడిన నాలుగు మ్యాచుల్లోనూ గెలుపొందిన బెంగళూరు టార్పెడోస్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుని సెమీఫైనల్ బెర్త్‌కు చేరువైంది. సోమవారం హైదరాబాద్‌లోని జిఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన పీవీఎల్ గ్రూప్ దశ మ్యాచ్‌లో చెన్నై బ్లిట్జ్‌పై 17-15, 14-16, 17-15, 16-14తో బెంగళూరు టార్పెడోస్ ఉత్కంఠ విజయం సాధించింది.

# ముగిసిన ఓపెన్ పికిల్‌బాల్ టోర్నీ



**హైదరాబాద్:** హైదరాబాద్ పికల్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన ఓపెన్ పికిల్‌బాల్ టోర్నమెంట్ సోమవారం ఘనంగా ముగిసింది. హైదరాబాద్‌లోని ప్యాడిల్‌వేవ్ స్పోర్ట్స్ సెంటర్‌లో జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో శర్వాణి చింతపల్లి, అనంత్ మణి ముని జోడీ 11-10, 11-10తో సష్టి చౌదరి, గోపి రెడ్డిలపై వరుస సెట్లలో మెరుపు విజయం సాధించి విజేతలుగా నిలిచారు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో వైశాక్ వివిస్ 11-10, 6-11, 11-0తో అనుతేజ్‌పై మూడు సెట్ల పోరులో పైచేయి సాధించి టైటిల్ సొంతం చేసుకున్నాడు. పురుషుల డబుల్స్ విభాగంలో గిరీశ్, విజరు తేజ్‌లు 15-11, 15-10తో గోపి రెడ్డి, సాయం బోత్రలపై అలవోక విజయం సాధించారు. హైదరాబాద్ పికిల్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు దుద్దిళ్ల శ్రీనివాస్ బాబు విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. హెచ్‌పీఏ ప్రతినిధులు సుమిరన్ కొమ్మరాజు, శ్రీధర్ సహా నిర్వాహకులు కార్తీక్, సత్యదీప్, మహేశ్, సంజీత్, కిశోర్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జిల్లా ఇమ్మినైజేషన్ అధికారిగా సురేష్ బాబు



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** శ్రీ సత్య సాయి జిల్లా ఎమ్మినైజేషన్ అధికారి గా సురేష్ కుమార్ సోమవారం బాధ్యతలు ఆయన విజయవాడ అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ నందు పనిచేస్తూ పదోన్నతి పై శ్రీ సత్య సాయి జిల్లాకు నియమితులవ్వగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.ఫైరోజాబేగం ను మర్యాదపూర్వకంగా కలిశారు,ఇంతకు మునుపు ఇంచార్జి జిల్లాఇమ్యునైజేషన్ అధికారిగా వున్నటువంటి డా.నాగేంద్ర నాయక్ నుండి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన డి.ఐ.ఓ గా బాధ్యతలు స్వీకరించి న డా.సురేష్ బాబు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లాలో జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు ఆరోగ్య సిబ్బంది సహాయ సహకారములతో "సార్వత్రిక వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని" మరింత సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

## లైసెన్స్ లేని బాణసంచా విక్రయాలపై చర్యలు



**పెళ్లకూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో మండల ప్రజలందరికీ ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు తెలియజేసిన పెళ్లకూరు ఎస్సై కే. నాగరాజు, బాణసంచా విక్రయాలపై కఠిన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ు మండల పరిధిలో ఎవరైనా లైసెన్స్ లేకుండా బాణసంచా లేదా టపాసులను తయారు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడం వంటి అక్రమ చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణభద్రత కోసం పోలీసులు ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. అలాగే, అక్రమంగా బాణసంచా నిల్వలు లేదా విక్రయాలు జరుగుతున్నట్లు ఎవరైనా గమనించిన పక్షంలో వెంటనే 112 కి కాల్ చేయవచ్చు లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌కి వెళ్లి సమాచారం ఇవ్వవచ్చని సూచించారు. సమాచారదాతల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని ఆయన హామీ ఇచ్చారు. దీపావళి సందర్భంగా ప్రజలు నియమ నిబంధనలు పాటిస్తూ పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని ఎస్సై కే. నాగరాజు పిలుపునిచ్చారు.

## నాణ్యతే ప్రామాణికంగా అర్జీల పరిష్కారం

### - జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 13:**

నాణ్యతే ప్రామాణికంగా అర్జీల పరిష్కారం, అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆదేశించారు, సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపుహాల్లో.. ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం జరిగింది. ఈ కార్య క్రమానికి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ తోపాటు ఇంఛార్జి డిఆర్వో సూర్యనారాయణ రెడ్డి, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ మాట్లాడుతూ.... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారద ర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పెన్షన్ ల మంజూరు తదితర అంశాలతో కూడిన వినతులను సమర్పించారు.

# ప్రధానమంత్రి సభను విజయవంతం చేద్దాం

**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 13 :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేద్దామని పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్, మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు , బాబ్జి పిలుపునిచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ నెల 16వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభను విజయవంతం చేద్దామని పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యామ్ కుమార్, మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు , బాబ్జి పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పత్తికొండ నియోజకవర్గంలోని 5 మండలాల టీడీపీ బూత్, యూనిట్, క్లస్టర్ స్థాయి ఇంచార్జిలు, బీజేపీ, జనసేన పార్టీ నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఆదినారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా పత్తికొండ ఎమ్మెల్యే కే ఈ శ్యాం కుమార్ మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో పరిశ్రమలు, పెట్టు బడులు వస్తున్న క్రమంలో ప్రధాని చేతులమీదుగా వాటిని ప్రారంభించే లక్ష్యంతో ఇక్కడ సభను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



కేంద్ర ప్రభుత్వానికి జీఎస్టీ తగ్గింపు వల్ల రూ.2లక్షల కోట్లు ఆదాయం పడిపోయినా ప్రజా సంక్షేమం కోరి జీఎస్టీ తగ్గించారన్నారు. జీఎస్టీ తగ్గింపు విషయం ప్రజల్లోకి తీసుకోవాల్సిన బాధ్యత కూటమి నాయకు లపై ఉందన్నారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామిని ప్రధాని దర్శించుకోనున్నట్ల తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. జీఎస్టీ సంస్కరణల తర్వాత తొలిసారి ప్రధాని ఉమ్మడి జిల్లాల్లో పర్యటిస్తున్నన్నట్లు తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్దేంచిన లక్ష్యానికి మించి జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుగ్గలి నాగేంద్ర, సాంబశివరెడ్డి, రాజశేఖర, బత్తిన వెంకటరమణ, చౌదరి, హరి,కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్త దౌర్జన్యం

### - సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు

**అన్నమయ్య బ్యూరో సూర్య వాస్తవం అక్టోబర్ 13:** అన్నమయ్య జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం వీరబల్లి మండలంలోని తాడిగుంటపల్లె గ్రామపంచాయతీ సమీపంలోని దేదారి చెరువు పై భాగాన 1732 సర్వే నంబర్ లో ఇతరులకు ఇచ్చిన రెండు ఎకరాల 59 సెంట్లు భూమిని గత కొన్నేళ్ల క్రితం వారితో గొడవపడి ఆక్రమించుకోవాలని ప్రయత్నించడంతో అప్పటి రెవిన్యూ అధికారులు ఆ ప్రాంతంలో ఇద్దరు గొడవ పడకూడదు అన్న ఉద్దేశంతో అక్కడ ప్రభుత్వ స్థలం అని సూచిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది. కానీ అధికార పార్టీ తమదేనని తమదైన శైలిలో రాజంపేట ఇన్చార్జి కూడా తమ వారి అంటూ గత వారం రోజుల క్రితం జెసిబి ద్వారా భూమిని ఆక్రమణ చేయడం జరిగింది. తాటిగుంటపల్లె సమీపానగల టిడిపి కార్యకర్త భాస్కర్ రాజు అనే అతను తన బినామీ ఎస్టీ కి సంబంధించిన ఒక అతనిని వెంట బెట్టుకొని తమ బెదిరిస్తూ భూమిని కాల్ చేయాలని గత కొన్ని నెలల నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నారని బాధితులు వాపోతున్నారు అయినప్పటికీ ఉన్నతాధికారులు చొరవ తీసుకొని భూమిని తమ ఆధీనంలోకి తీసుకుంటూ సూచిక బోర్డు ఏర్పాటు చేయడం జరిగింది.

ప్రస్తుతం వారికి రెవెన్యూ అధికారులు సహకరించడంతో ఆ గ్రామ విఆర్వో కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తూ వారికి దగ్గరుండి భూమిని చదును చేయించినట్లు పలువురు నుండి తెలిసింది .ఏది ఏమైనప్పటికీ టిడిపి అధికార ఉంది కదా అని ఒక కార్యకర్త ఇతరుల భూమిని కాజేయాలని చూస్తూ సూచిక బోర్డుని కూడా లెక్కచేయకుండా తీసి పడేసి రాత్రి వేళల్లో జెసిబి ద్వారా భూమిని చదును చేయడం జరిగింది.





సంబంధించి ఆ గ్రామపంచాయతీ వీఆర్వో సాగర్ ని ప్రశ్నించగా పేపర్లో రాసుకోండి తర్వాత అధికారులకు తెలిసి ఏమైనా న్యాయం చేస్తానని సమాధానం ఇచ్చారు .ఇందుకు సహకరిస్తున్న సంబంధించిన వారిపై చర్యలు తీసుకొని జిల్లా అధికారులు తమకు న్యాయం చేసి తమ భూమి తనకు ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు

# సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పై అవగాహన

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** జీఎస్టీ ప్రయోజనాలను రాష్ట్రంలోని ఇంటింటికీ తీసుకెళ్లేలా సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. రాష్ట్రమంతటా జీఎస్టీ 2.0 సంస్కరణలపై విస్తృత ప్రచారం చేసేలా ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శ్రీ సత్య సాయిజిల్లాలోని ధర్మవరం సర్కిల్ వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ అధికారి( సిటిఓ) ఉత్తర్వుల మేరకు గోరంట్ల పట్టణంలో జీఎస్టీ అధికారులు జిఎస్టి అకౌంటెంట్లు కలసి పలు దుకాణాల్లో సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ పై, సోమవారం దుకాణయజమానులకు,వినియోగదారులకు, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎస్టీ అధికారులు మాట్లాడుతూ...భారతదేశం అంతటా అగ్రగామిగా ఉండాలని, భారతదేశం అన్నిట్లో ముందుండాలని భారత ప్రధాని నరేంద్ర మోడీ బడుగు బలహీన వర్గాల ప్రజలు అందరూ అన్ని రంగాల్లో ముందుండాలని గొప్ప నిర్ణయంతో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని,పేద, మధ్యతరగతి వర్గాలకు సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం, ప్రతి కుటుంబానికి రూ.15వేలు వరకు ఆదా అవుతుందని, జీఎస్టీ స్లాబ్‌లు నాలుగు నుంచి రెండు స్లాబ్‌లకు తగ్గించడం వల్ల రోజువారీ అవసరాల వస్తువులు తక్కువ ధరలో లభించటం, చిన్న వ్యాపారాలపై పన్ను భారము తగ్గడం, కొత్త వ్యాపారాలు సులభంగా ప్రారంభం కావడం,



సాధారణ కుటుంబాలకు నెలసరి ఖర్చు తగ్గడం వంటి ప్రత్యక్ష ప్రయోజనాలు లభించనున్నాయని,ప్రధానంగా ప్యాకింగ్ చేసిన వస్తువులు కొనుగోలు చేస్తున్నప్పుడు వినియోగదారులు జాగ్రత్త వహించాల్సి ఉంటుందని,వినియోగదారుల వ్యవహారాల శాఖ గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను సవరించడంతో స్థానిక దుకాణాల్లో కొంత గందరగోళం తలెత్తే అవకాశం ఉందని,సెప్టెంబర్ 22కు ముందు తయారై ప్యాకింగ్ చేసిన వస్తువులపై కొత్త ఎంఆర్పీతో స్టిక్కర్లు అతికించేందుకు అనుమతించిందని, దుకాణదారులు తమ దుకాణాలలో కొత్త ఎమ్మార్పీ ధరలు కు పాత ఎమ్మార్పీ ధరలకు వ్యత్యాసాన్ని ప్రతి ఒక్క వినియోగదారునికి వివరించాలని, అదేవిధంగా కొత్త ఎమ్మార్పీ స్టిక్కర్లు,, పాత ఎంఆర్పీ కనిపించేలా ఉండాలని , దీంతో వినియోగదాసులు అయోమయానికి గురికాకుండా కొత్త ధర ఏది, ఎంత మేర తగ్గింది అనే విషయాన్ని గుర్తించేలా ఉండాలని,లేదంటే కొందరు దుకాణదారులు పాత ధరలకే విక్రయించి అదనంగా వసూలు చేసే ప్రమాదం ఉందని, కొత్త జీఎస్టీ ధరలను వినియోగదారుల గుర్తించగలిగినప్పుడే జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు అందుతుందని, జీఎస్టీ కొత్త పన్ను శ్లాబుల ప్రకారం 5 శాతం లేదా 18 శాతం మాత్రమే ఉంటుందని, సెప్టెంబర్ 22వ తేదీ తర్వాత తయారు చేసే వస్తువులు, దిగుమతి చేసుకునే వస్తువులపై కొత్త ఎంఆర్పీ ముద్రించాల్సి ఉంటుందని,అయితే, మందులు, మెడికల్ సామగ్రికి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయని,పాత వస్తువులు, ఔషధాలపై ఎంఆర్పో మార్చడం తప్పనిసరి ఏం కాదు. కానీ, కొత్త స్టిక్కర్లు, ముద్రలు వేసి విక్రయించవచ్చు. అయితే, పాత ఎంఆర్పీ రేట్లు కనిపించాలని, కొత్త ధరలు తగ్గినట్లు స్పష్టంగా కనిపించాల్సి ఉంటుందని,వినియోగదారులు బిల్లులు చెల్లించేటప్పుడు బిల్లు అడిగి తీసుకుని అందులో కచ్చితంగా చెక్ చేయాలని, పాత ధర వేశారా.....?లేదా కొత్త ధర వేశారా...? చూడాలని....పాత ధర వేసినట్లయితే దుకాణ యజమానిని ప్రశ్నించాలని, కొత్త ధరతో మాత్రమే కొనుగోలు చేయాలని... పాత మీ స్టాక్ కానీ లేదా కొత్త సరుకు కానీ కొత్త జి ఎస్టీ రేట్లతోనే విక్రయించాలని, అవగాహన కార్యక్రమంలో జిఎస్టి అధికారులు, జిఎస్టి అకౌంటెంట్లు, దుకాణ యజమానులు, వినియోగదారులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )

## జీఎస్టీ సంస్కరణలతో కోట్లాది మందికి లబ్ధి

**- రాయదుర్గం ర్యాలీలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం, సూర్య వాస్తవం అక్టోబర్ 13 :** కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల ద్వారా కోట్లాదిమందికి లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాయదుర్గం పట్టణంలో నిర్వహించిన "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" అవగాహన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ... జీఎస్టీ సంస్కరణల ద్వారా ఏటా దేశంలోని ప్రజానీకానికి సుమారు రూ.2 లక్షల కోట్ల సొమ్ము ఆదా అవుతోందని వివరించారు. ఈ విషయాన్ని అన్ని వర్గాలకు తెలియజేయవలసిన బాధ్యత కూటమి ప్రభుత్వంలోని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, ప్రభుత్వ అధికారులకు ఉందని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, అట్లాగే వ్యాపారస్తులు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ పార్టీల కూటమి నాయకులు కార్యకర్తలు, ప్రజలు, రైతులు, ముఖ్యంగా మహిళలు అందరూ పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటికే "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" అంశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు మూడు కార్యక్రమాలను నిర్వహించామన్నారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ కూడా ఇటీవలే రాయదుర్గం వచ్చి అవగాహన కల్పించారన్నారు. ఈనెల 16న కర్నూలులో "సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్" పేరుతో గొప్ప బహిరంగ సభను నిర్వహించబోతున్నామన్నారు. అందులో స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొనబోతున్నారనీ తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలు ఉపయోగించే నిత్యవసర వస్తువులతో పాటు తినుబండారాలు, టీవీలు, ఫ్రిడ్జ్, కార్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ వస్తువులు, వ్యవసాయ పరికరాలు తదితరాలు తగ్గింపు ధరలకే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. సాధారణంగా ఎప్పుడు పెరిగే రేట్లు ఈసారి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వం లో తగ్గడం ప్రతి ఒక్కరూ గమనిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనకరమైన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నందున వాటిని భారీ ఎత్తున ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల వెంకటేశులు, పురుషోత్తం, బండి భారతి,పూజారి తిప్పయ్య,వై.వెంకటేశులు, నాయకులు తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కృష్ణ దేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 13 :** శ్రీ కృష్ణ దేవరాయల జయంతిని, వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలని గోరంట్ల మండలంలోని బలిజ సంఘం నాయకులు సోమవారం తహసిల్దార్ మారుతి కి వినతిపత్రం సమర్పించారు,తెలుగు సంస్కృతి, సాహిత్యం, కళలు, విద్యా రంగాలలో అపార కీర్తి తెచ్చిన మహానుభావుడు శ్రీ కృష్ణదేవరాయ దేశానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవానికి ప్రతీకగా నిలిచారనీ,ఆయన పాలనలో ప్రజలకు శాంతి, సమృద్ధి, విద్య, వైద్యం, కళలకు విలువ లభించాయి. వేల చెరువులను, తటాకాలను, గుళ్లను గోపురాలను నిర్మించిన దక్షిణాది భారతదేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించిన మహానుభావుడన్నారు, అటువంటి మహానుభావుడి జయంతిని మరియు వారి వర్ధంతి రోజును ప్రతి సంవత్సరం అధికారికంగా నిర్వహించడం ద్వారా యువతకు స్ఫూర్తి నీ కొనసాగించాలన్నారు, ఈ కార్యక్రమాన్ని మండల స్థాయిలోనే కాక జిల్లా స్థాయిలోనూ మరియు రాష్ట్ర స్థాయిలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలన్నారు, రాష్ట్ర హస్తకళల డైరెక్టర్ సోమశేఖర్, జనసేన మండల కార్యదర్శి సంతోష్ కుమార్,నరేంద్ర రాయల్, బాలాజీ, బీరే వేణుగోపాల్, గంగాధర్,లక్ష్మీ నారాయణ,రమేష్,హరి, కిషోర్ రాయల్ తో పాటు బలిజ సంఘం నేతలు,కులస్తులు పాల్గొన్నారు.

# సమయపాలన పాటించని పోస్ట్ ఆఫీస్ సిబ్బంది

## - ఖాతాదారులు తీవ్ర అవస్థలు

**అనంతపురం టౌన్ - సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాల్సిన సిబ్బంది కొందరు సమయపాలన పాటించక సామాన్యులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు.విధుల్లో ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఉన్నతధికారులు చెబుతున్న కొందరి తీరు మాత్రం మారటం లేదు అసలు వివరాల్లోకి వెళితే.....అనంతపురంలోని స్థానిక పాతూరు పోస్ట్ ఆఫీస్ ఖాతాదారులకు, పెన్షనర్స్ అవస్థలు తప్పడం లేదు.సిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో.. ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.సోమవారం నాడు ఉదయం 11 గంటలు అవుతున్నా అధికారులు, కార్యాలయం సిబ్బంది ఎవరు కూడా విధులకు హాజరు కాకపోవడం శోచనీయం. ప్రజలు వివిధ పనుల నిమిత్తం గంటలకొద్ది వేచి చూస్తూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖాతాదారులు ఉదయం నుంచే పోస్ట్ ఆఫీస్ ముందు క్యూ కడుతున్నారు. ఉదయం సమయంలో పోస్ట్ ఆఫీస్ తలుపులు తెరిచిన సిబ్బంది ఇష్టారీతిన విధులకు హాజరవుతున్నారని ఖాతాదారుల వాపోతున్నారు. పోస్ట్ ఆఫీస్ సిబ్బంది సమయపాలన లోపం వల్ల తమ పనులు చేసుకోలేక, కార్యాలయాల వద్ద గంటల తరబడి ఎదురుచూడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఉన్నతాధికారులు ఈ సమస్యలను పరిష్కరించి, అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.






# వెలగని వీధి దీపాలు

- అంధకారంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి రోడ్డు...
- రాత్రయ్యిందంటే కుర్రకారు ఇష్టానుసారం....!
- అటుగా వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్న సామాన్యులు

**అనంతపురం క్రైం - సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** నగరంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింద...? అధికారుల పర్యవేక్షణ లేక పలు ప్రాంతాల్లో సమస్య జఠిలమై వీధుల్లో చీకట్లు కమ్ముకుంటున్నాయ...? అసలు వివరాల్లోకి వెళితే...... అనంతపురం నగరంలోనీ స్థానిక ఆర్టీవో ఆఫీస్ నుండి కె ఎస్ ఎన్ కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వెళ్ళే రోడ్డులో సాయంత్రమైదంటే రోడ్లన్నీ చిమ్మచీకట్లతో కమ్ముకుంటున్నాయి. వాహనాల లైట్ల వెలుతురులో పాదచారులు రోడ్డు దాటుతుండగా.. అరకొరగా ఉన్న వెలుతురుల మధ్య వాహనదారులు భయం భయంగా గమ్యాలకు చేరుకుంటున్నారు.ప్రధాన వీధుల వెంబడి ఇంత అధ్వానమైన స్థితి ఉన్నా అధికారులు నిత్యం ఇదే రోడ్లపై తిరుగాడుతున్న పట్టింపు లేకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇలా ఉంటే... చీకటి పడితే చాలు కుర్ర కారు చుట్టాపట్టలేసుకొని అక్కడ అడ్డగా మార్చుకున్నారని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా కొందరు వ్యక్తులు బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం వంటివి చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని





## విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి

# ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**- జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్**

**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 13:** విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని... ఇందులో భాగంగా వారి అభివృద్ధికి అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ తెలిపారు,సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగిన పీజిఆర్ఎస్ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో... డిగ్రీ , బిటెక్ ఉన్నత చదువు చదువుకొనే ఇద్దరు విభిన్న పతిభావ౦తులకు 2 లాప్ టాప్ లు, 10 మంది బధిరులకు 10 టచ్ ఫోన్ లు, ఒక దివ్యాంగురాలికి వీల్ ఛైర్ లను కలెక్టరు చేతుల మీదుగా అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న





పరికరాలను ఉపయోగించుకొని వారు మరింత ఉన్నతంగా రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు,ఈ కార్యక్రమంలో ఇంచార్జి డిఆర్ఓ సూర్యనారాయణ రెడ్డి, ఆర్డిఓ సువర్ణ, విభిన్న





పతిభావ౦తులు మరియు వయోవృదుల సహాయ స౦స్థ సహాయ సంచాలకులు, జిలామేనేజరు జి.అర్చన, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.